పవర్ తెలుగు

ప్రభాత కిరణమ్ — సత్యానికి వారధి

PRJI REGD NO. TGTEL/26/A4986

5 DOTS NETWORK

మేడ్చల్--మల్కాజిగిరి సోమవారం 23-11-2026 సంపుటి : 01, సంచిక : 144 పేజీలు : 08 వెల రూ./-4 www.prabhathakiranam.com

Medchal malkajigiri volume:01, issue:144, pages:08 price : Rs./-4 Monday - 23-11-2026 Circulated to Telangana, published from medchal malkajigiri

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 90 సీట్లు, కోటి ఓట్లు సాధిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి
- రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు 15 లోక్‌సభ స్థానాలు గెలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- గతంలో టీడీపీ, బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ కూడా పదేళ్లు అధికారంలో ఉంటుందని వ్యాఖ్య
- ప్రభుత్వంపై బహిరంగంగా మాట్లాడే నేతల తీరును నిశితంగా గమనిస్తున్నామని హెచ్చరిక
- తెలంగాణ చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వెల్లడి


2లో

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాలు సాధించడంతో పాటు కోటి ఓట్లు పొంది తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 15 లోక్‌సభ సీట్లు

హైదరాబాద్ కు బాంబు బెదిరింపులు.. అప్రమత్తమైన పోలీస్ శాఖ

- హైదరాబాద్‌లో బాంబు దాడులు చేస్తామంటూ బెదిరింపు ఈమెయిల్
- నగరవ్యాప్తంగా ముమ్మరంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు
- వదంతులు నమ్మవద్దని నగర సీపీ విజ్ఞప్తి
- నిందితుల కోసం సైబర్ క్రైమ్ పోలీసుల ముమ్మర గాలింపు
- అనుమానం వస్తే వెంటనే 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచన


2లో

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బాంబు దాడులు జరపనున్నట్లు వచ్చిన ఒక బెదిరింపు ఈమెయిల్‌పై హైదరాబాద్ సిటీ పోలీసులు అత్యంత వేగంగా స్పందించారు. ఈమెయిల్ అందిన వెంటనే నగరవ్యాప్తంగా విస్తృత స్థాయిలో ముందుజాగ్రత్త

సిద్ధిపేట 'సదర్'లో హరీశ్ రావు జోష్.. ఫొటోలు ఇవిగో!

- సిద్దిపేటలో ఘనంగా నిర్వహించిన సదర్ వేడుక సందడి చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు
- త్వరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా
- సర్వేలు సైతం బీఆర్ఎస్ పునరాగమనాన్ని స్పష్టం చేస్తున్నాయన్న నేత
- సోషల్ మీడియాలో సదర్ ఫొటోలను పంచుకున్న హరీశ్ రావు



సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొని సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ వేడుకల్లో - మిగతా 2 లో

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!



- నవంబర్ 27 తర్వాత బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశం
- అల్పపీడనంగా బలపడే సూచనలు
- ఏపీకి ప్రస్తుతానికి తుపాను ముప్పు లేదన్న నిపుణులు
- శ్రీలంక లేదా తమిళనాడు వైపు వెళ్లే అవకాశాలే ఎక్కువ
- తూర్పు గాలులతో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు

దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో నవంబర్ - మిగతా 2 లో

బంగారం కొనుగోళ్లు వాయిదా వేయాలన్న మోదీ సలహాకు వ్యాపార సంఘం కృతజ్ఞతలు

- కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ
- బంగారం కొనుగోళ్ల వాయిదాపై ప్రధాని మోదీ ఇచ్చిన సూచనను సమర్థించిన బీజేపీ
- కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, వ్యాపారులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్
- ప్రధాని సూచనతో వ్యాపారులు నష్టాల బారిన పడకుండా కాపాడారన్న సీటీఐ
- కిలో బంగారంపై రూ. 65 లక్షల వరకు తగ్గిన ధరతో కొనుగోలుదారులకు ఊరట


2లో

బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలంటూ గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన సలహా వ్యాపారులను, మదుపర్లను భారీ నష్టాల నుంచి కాపాడిందని బీజేపీ పేర్కొంది. నాడు ప్రధాని

ముగియనున్న జేఈఈ మెయిన్ రిజిస్ట్రేషన్ గడువు

13 లక్షలు దాటిన దరఖాస్తులు



- నేటి రాత్రి 11:50 గంటలతో ముగియనున్న జేఈఈ మెయిన్ సాధారణ రిజిస్ట్రేషన్ గడువు
- ఇప్పటివరకు ఫీజు చెల్లించి ప్రక్రియ పూర్తి చేసుకున్న 13.10 లక్షల మంది అభ్యర్థులు
- మొత్తంగా 15 లక్షలకు పైగా అభ్యర్థుల నుంచి అందిన దరఖాస్తు ఫారమ్‌లు
- రేపటి నుంచి నవంబర్ 26 వరకు రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు అవకాశం

గుర్తింపు ధ్రువీకరణ సమస్యలు రాకుండా డిజిలాకర్ ద్వారా లాగిన్ కావాలని - మిగతా 2 లో

పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా?

జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్

- కూటమి ప్రభుత్వంలో గ్లోబల్ బ్రాండ్లు భారీ పెట్టుబడులు పెట్టాయని వెల్లడి
- గూగుల్, రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ వంటి దిగ్గజ సంస్థల ప్రాజెక్టుల వివరాలు ప్రస్తావన
- గతంలో ప్రాజెక్టులను అడ్డుకునేందుకు పిల్‌లు వేశారంటూ లోకేశ్ ఆరోపణ
- రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్



ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరియు ఉద్యోగాల కల్పన అంశాలపై వైసీపీ అధినే జగన్ కు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బహిరంగ సవాల్ విసిరారు. - మిగతా 2 లో

దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారు

- కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్న రేవంత్ రెడ్డి
- 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ గణనను చేర్చాలని టీపీసీసీ పీఏసీ సమావేశంలో తీర్మానం
- ఓబీసీ గణన అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయాలని పీసీసీ చీఫ్‌కు సీఎం సూచన
- సంక్రాంతి తర్వాత ఐదు నెలల పాటు పల్లె పల్లెకు 'ప్రజా బలం' కార్యక్రమం
- ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి రూ. 30,000 కోట్లు సాయం కోరిన ముఖ్యమంత్రి
- దేశవ్యాప్తంగా 13 కోట్లు తెలంగాణలో 71 లక్షల ఓట్లు తొలగించారంటూ సీఎం రేవంత్ ఆరోపణ



2027 జనాభా లెక్కల్లో ఓబీసీ (గాదీజ) గణనను తప్పనిసరిగా చేర్చాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే జనాభా లెక్కల్లో ఓబీసీ గణనను చేర్చాలంటూ ఈ సమావేశంలో కాంగ్రెస్ పీఏసీ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌కు ముఖ్యమంత్రి సూచించారు. గత 100 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం కుల గణనను విజయవంతంగా చేపట్టిందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత 5 నెలల పాటు 'ప్రజా బలం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలంతా ప్రతి గ్రామాన్ని సందర్శించాలని - మిగతా 2 లో

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది

మొదటిపేజీ తరువాయి – గెలుచుకుని, రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేసే బాధ్యతను తెలంగాణ కాంగ్రెస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ, సలహా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాలు గెలుచుకుందని, మిత్రపక్షమైన సీపీఐ ఒక స్థానం దక్కించుకుందని సీఎం గుర్తుచేశారు. గతంలో టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలు వరుసగా రెండు పర్యాయాలు గెలిచినట్లే, కాంగ్రెస్ కూడా మళ్లీ గెలిచి పదేళ్ల పాటు అధికారంలో ఉంటుందని చెప్పారు. 2024 ఎన్నికలకు ముందే బీజేపీ 240 సీట్లకు మించి గెలవదని తాను చెప్పిన విషయం నిజమైందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇదే సమయంలో పార్టీ నాయకులకు కూడా ఆయన స్పష్టమైన హెచ్చరిక చేశారు. ప్రభుత్వంపై బహిరంగంగా నెగెటివ్ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, ఎవరు ఏం మాట్లాడుతున్నారో పార్టీ వద్ద పూర్తి సమాచారం ఉందని తెలిపారు. పార్టీ లైన్‌లో నడిచే వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వం నేరుగా ప్రజల్లోకి వెళ్లనుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దీని ఆధారంగానే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే కేంద్రానికి లేఖ రాశారని ఆయన వివరించారు.

బిజెపి కీసర డివిజన్ నూతన ప్రధాన కార్యదర్శిగా కొమ్ము చిరంజీవి నియామకం

యాధ్గిరిపల్లి ప్రధాన చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల

కీసర నవంబర్ 22 సూర్య న్యూస్: కీసర డివిజన్ వన్ యాద్గారిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము చిరంజీవి భారతీయ జనత పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం చేయడం జరిగింది ఈ మేరకు బిజెపి కీసర డివిజన్ అధ్యక్షులు కోళ్ల బాల్‌రాజ్ యాదవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కొమ్ము చిరంజీవి యాగిరిపల్లి గ్రామంలో ప్రధాన చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల అర్పించారు ఈ కార్యక్రమంలో బిజెపి కార్యదర్శులు అంబేద్కర్ యూత్ సభ్యులు గాలిగల్లా శ్రీనివాస్ దాయర బాల నరసింహ తాటిపాముల నరేందర్ దాయర నవీన్ సతీష్ ప్రవీణ్ ఓంకార్ టింకు తదితరులు పాల్గొన్నారు



రూ.49 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ నవంబర్ 22 సూర్య న్యూస్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో రూ.49 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ 2014 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు ప్రస్తుతం ఎమ్మెల్యే 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఇప్పుడు ప్రభుత్వం వద్ద నిధులు లేవని విమర్శిస్తున్నారని, తాము జిల్లా ఇన్చార్జ్ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకొచ్చి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తుంటే ఈ ఎమ్మెల్యే రోడ్ల నిర్మాణం పూర్తయినంక రిబ్బన్ కటింగ్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ రావు, మురళి కృష్ణ, యాదగిరి, పాండు, నాగరాజు, కరీం, శివ రామ రాజు, ధనుంజయ్ నాయక్, చందన్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం.. చిన్నారులకు పోలియో చుక్కలు



కీసర నవంబర్ 22 సూర్య న్యూస్ కీసర: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పల్స్ పోలియో చుక్కలు ఎంతో అవసరమని, ఐదేళ్లలోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని నాయకులు సూచించారు. కీసర డివిజన్--1 పరిధిలోని కీసర గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాయకపు మాధురి వెంకటేష్ ముదిరాజ్, కీసర డివిజన్--1 బీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిక్కుడు రమేష్ ముదిరాజ్, కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్, కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు శీలం మల్లేష్, గౌరంటీ ప్రవీణ్ గ్రామ యువ నాయకులు సుమన్ బన్నీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నర్సులు, అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఏ చిన్నారికీ పోలియో చుక్కలు వేయకుండా మిగిలిపోకూడదని నాయకులు కోరారు.

స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు,

అకాల మరణం చెందిన గద్దం శ్రీనివాస్ కుటుంబానికి రూ.30,000/- వేల ఆర్థిక సహాయం అందజేత,



కీసర నవంబర్ 22 సూర్య న్యూస్ స్నేహబంధానికి నిజమైన అర్థం చాటిన 2005--2006 పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితుని మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేస్తూ, మానవత్వాన్ని చాటుకున్న 2005--2006 పదవ తరగతి పూర్వ విద్యార్థులు. తమ తోటి స్నేహితుడు గద్దం శ్రీనివాస్ అకాల మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన పూర్వ విద్యార్థులు, ఆయన కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో రూ.30,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మేడ్చల్ జిల్లా భోగారం గ్రామానికి చెందిన గద్దం శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న 2005--2006 పదవ తరగతి పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి, తమ స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్పునిచ్చి, మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి తమ వంతుగా రూ.30,000/- ఆర్థిక సహాయం అందించి కష్టకాలంలో అండగా నిలిచారు. స్నేహితుని మరణం తమను తీవ్రంగా కలచివేసిందని, ఆయన కుటుంబం ఒంటరిగా భావించకుండా తామంతా అండగా ఉంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు. స్నేహితుని జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, కుటుంబానికి అవసరమైన సమయంలో సహాయం చేయడం తమ బాధ్యతగా భావించామని పేర్కొన్నారు. స్నేహం అంటే కేవలం కలిసి చదువుకున్న రోజులు, కలిసి గడిపిన క్షణాలు మాత్రమే కాదు.. కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవడం, బాధను పంచుకోవడం, ఆపదలో ఆదుకోవడమే నిజమైన స్నేహమని ఈ పూర్వ విద్యార్థులు తమ సేవాభావంతో చాటిచెప్పారు. అకాల మరణం చెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, మానవత్వం, స్నేహబంధం, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచిన 2005--2006 పదో తరగతి పూర్వ విద్యార్థుల ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో పడమటి రాజిరెడ్డి, కిషోర్ ముదిరాజ్, పవన్, నరేష్ యాదవ్,భాను,ఉపేందర్, నాగిరెడ్డి,మహేష్ తదితరులు పాల్గొన్నారు..

హైదరాబాద్‌పై కాలుష్య పంజా ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

మొదటిపేజీ తరువాయి – ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ూూ×) 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ూూ× ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ



కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిద్ధిపేట 'సదర్'లో హరీశ్ రావు జోష్.. ఫొటోలు ఇవిగో!





మొదటిపేజీ తరువాయి – ఆయన యాదవ సోదరులతో కలిసి ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. స్థానిక ప్రజలు, యువతతో మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో హరీశ్ రావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తలపాగా ధరించి, చేతిలో హాకీ బ్యాట్ పట్టుకుని పైకెత్తుతూ యువతతో కలిసి జోష్ ప్రదర్శించారు. తనకు బహూకరించిన కత్తిని గాల్లోకి దూశారు. సిద్దిపేటలో జరిగిన ఈ సదర్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఉత్సవాల అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పలు సర్వేలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో సిద్దిపేట రాజకీయాల ప్రస్తావన రావడంతో వేదికపై సవాళ్లు, ప్రతిసవాళ్లు చోటుచేసుకున్నాయి. స్థానిక అభివృద్ధిపై ఎవరైనా చర్చకు రావచ్చంటూ నాయకులు ఒకరికొకరు సవాళ్లు విసురుకోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఏదేమైనా, సంప్రదాయ ఉత్సవాలను ప్రజలంతా కలిసికట్టుగా, ఉల్లాసంగా జరుపుకోవడం అభినందనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు.

దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారు



మొదటిపేజీ తరువాయి – పిలుపునిచ్చారు. నాయకులకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగిస్తామని, నిధుల కొరత లేకుండా చూస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు ఇప్పటికే సముచిత పదవులు దక్కాయని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో, తెలంగాణ నూతన ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన బి.ఎం. సందీప్‌కు ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. సీనియర్ నాయకుడిని రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న సహాయక చర్యల గురించి ముఖ్యమంత్రి వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల సరిపడా వర్షపాతం నమోదు కాలేదని, ఈ పరిస్థితులను అధిగమించడానికి కేంద్రం రూ. 30,000 కోట్లు ఆర్థిక సాయం అందించాలని కోరారు. రైతులు ఆరుతడి పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేస్తూ, రాష్ట్రంలో ఆహార ధాన్యాల కొరత ఏమీ లేదని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలు, మన పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక సైతం తీవ్ర కరవును ఎదుర్కొంటున్నాయని గుర్తుచేశారు. రాబోయే 8 నెలల పాటు తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా ప్రాజెక్టుల్లోని నీటి వనరులను పూర్తిగా తాగునీటి అవసరాలకే కేటాయిస్తున్నామని వెల్లడించారు. వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ 20,000 మెగావాట్లకు చేరినప్పటికీ, విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేసి పంటలను కాపాడామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం మరో పెద్ద కార్యక్రమాన్ని చేపట్టనుందని, ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగిందని తెలిపారు. ఓట్ల తొలగింపు వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచే దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మహిళల ఓట్లను వలసల పేరుతో తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ (ూ×=) ముసుగులో కేంద్రం ఓట్లను గల్లంతు చేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు, ఒక్క తెలంగాణలోనే 71 లక్షల ఓట్లను తొలగించారని సీఎం పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో 'సైమన్ గో బ్యాక్' తరహాలోనే, ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణులు 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' నినాదంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఇంటింటా పేరులో చిన్న తేడా వచ్చినా ఓట్లను తొలగిస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌వోలు ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బీజేపీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారుగా రెండు వర్గాలుగా విభజిస్తూ, ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మారుస్తోందని ఆయన ఆరోపించారు.

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ఫోన్ సంభాషణ

మొదటిపేజీ తరువాయి – రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధానమంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే 'మానవతా దృక్పథాన్ని' (ఎబఎుఅ-ఎవత్‌తీఅఎ ుజూజూతీశీుఎష్ట్ర) పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు. మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు. "ఇది యుద్ధాన్ని కొనసాగించాల్సిన సమయం కాదు.. ముగించాల్సిన సమయం అని రష్యా నాయకత్వంతో సహా అందరికీ ప్రధాని మోదీ గతంలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికేలా భారత్ తన వంతుగా ఎలాంటి చర్యలు తీసుకోగలదో గుర్తించడం, ఇతర దేశాల నాయకులతో సంప్రదింపులు జరపడం ఎంతో కీలకం" అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో నిలిచిపోయిన ధాన్యపు ఎగుమతులు, ఆహార భద్రత అంశంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. ఆహార రవాణా కారిడార్ల పునరుద్ధరణలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో భారత్ చేసే ప్రయత్నాల కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ తెలిపింది. సముద్ర మార్గాలను అడ్డుకోవడం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు వివిధ దేశాల్లోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఈ సంక్షోభ పరిష్కారం కోసం భారత్ నిరంతరం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. పౌర నౌకలు మరియు నావికులపై దాడులు జరగకుండా చూడటం, నల్ల సముద్రం ద్వారా ధాన్యపు ఎగుమతులను పునరుద్ధరించడం, అలాగే ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగకుండా చూడటం అనే మూడు ప్రధాన అంశాలపై భారత్ రష్యా, ఉక్రెయిన్ మరియు యూరప్ దేశాలతో చర్చిస్తోందని తెలిపారు.

పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా? జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్



మొదటిపేజీ తరువాయి – కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, ఏర్పాటవుతున్న ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ, జాతీయ స్థాయి అగ్రశ్రేణి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని, తద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత భవిష్యత్తు కోసం పరిశ్రమలను రప్పించే ప్రయత్నం చేస్తుంటే, గత పాలకులు ప్రాజెక్టులను అడ్డుకోవడానికి న్యాయస్థానాల్లో పిటిషన్లు వేశారని, ఆ తర్వాత మళ్లీ ప్రాజెక్టుల క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా 2024-26 కాలానికి సంబంధించిన పారిశ్రామిక ప్రగతి వివరాలను మంత్రి పంచుకున్నారు. అందులో గూగుల్ (రూ. 1,33,000 కోట్లు), ఏఎం/ఎన్ఎస్ ఇండియా (రూ. 1,36,000 కోట్లు), బ్రూక్‌ఫీల్డ్ (రూ. 1,06,000 కోట్లు), రిలయన్స్ (రూ. 43,000 కోట్లు), రెన్యూ, వారీ, ప్రీమియర్ ఎనర్జీస్, అల్ట్రాటెక్, దాల్మియా భారత్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, టాటా, ఐబీఎం, కాగ్నిజెంట్ తదితర సంస్థల ప్రాజెక్టులు వివిధ దశల్లో (కమిషన్డ్, నిర్మాణంలో, ఆపరేషనల్) ఉన్నట్లు ఆ జాబితాలో చూపించారు. ఈ వివరాలను ప్రస్తావిస్తూ.. "ఇది మా ట్రాక్ రికార్డ్. పరిశ్రమల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన మరియు రాష్ట్ర అభివృద్ధిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నా సవాల్‌ను స్వీకరించడానికి మీరు సిద్ధమేనా?" అంటూ జగన్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు.

కల్తీ మద్యం కలకలం:

16 మంది మృతి.. 600 మందికి అస్వస్థత



కామారెడ్డి జిల్లా నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): మణిపూర్‌లో కల్తీ మద్యం సేవించి భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించింది. ఈ ఘటనకు సంబంధించిన ముఖ్య అంశాలు:

కల్తీ మద్యం తాగి ఇప్పటివరకు 16 మంది మరణించారు.

సుమారు 600 మంది తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రుల్లో చేరారు.

పోలీసులు కేసు నమోదు చేసి అక్రమ మద్యం సరఫరాపై విచారణ చేపట్టారు.

బాధితుల్లో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడ్డం ఇందుప్రియ



కామారెడ్డి జిల్లా నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా మాజీ కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ గారు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మహిళా కాంగ్రెస్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, మహిళల సమస్యల పరిష్కారం, మహిళా సాధికారత, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని గడ్డం ఇందుప్రియ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ కార్యదర్శి పిడుగు మమత, నిత్య, గీత, ప్రవళిక, వనిషా , మమత, జ్యోతి ఉన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వం తోనే పేదలకు ఇల్లు భరోసా

లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అంద చేసిన ఐరన్ నరసయ్య..



కామారెడ్డి జిల్లా నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): ఇందిరమ్మ ప్రభుత్వంతోనే నిరుపేదలకు పూర్తి సబ్సిడీతో ఇళ్లు మంజూరుతో లబ్ధి చేకూరుతుందని సర్పంచ్ ఐరేని నర్సయ్య అన్నారు. దోమకొండలో అచ్చె రవి–కృష్ణవేణి, కర్రె రజని–శ్యామ్, వడ్ల రాజమణి – శ్రీనివాస్ లకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సహకారంతో దోమకొండలో ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మాజీ జెడ్పిటిసి సభ్యులు తీగల తిరుమల్ గౌడ్ లబ్ధిదారులకు బట్టలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీ ఎస్ చైర్మన్ అనంతరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సీతారాం మధు, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీనివాస్, చేనేత సహకార సంఘం చైర్మన్ బత్తిని సిద్ధ రాములు, షమ్మీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన వడ్డేపల్లి సుభాష్ రెడ్డి

జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాంతో కలిసి మాతృవియోగంపై సంతాపం..



కామారెడ్డి జిల్లా నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): నిజాంసాగర్ మాజీ జడ్పీటీసీ ప్రదీప్ మాతృమూర్తి మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాంతో కలిసి ఆదివారం ప్రదీప్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బిక్కనూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పరంధాములు, అఫిజ్ పటేల్, బాలకిషన్, నీల రవి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం..క్రమశిక్షణ ఉల్లంఘనపై కఠిన చర్యలు

ఐదుగురు సిబ్బంది పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్..మరో 09 మందిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు



బెల్లంపల్లి నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కొందరు పోలీస్ సిబ్బంది విధి సమయంలో బాధ్యతలను విస్మరించి, పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ డ్యాన్స్ చేయడంతో పోలీస్ శాఖ క్రమశిక్షణకు, ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారు.ఈ ఘటనపై స్పందించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐదుగురు సిబ్బందిని పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ,మరో 09 మంది సిబ్బంది పై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సిబ్బందికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుతమైన విధి నిర్వహణ అత్యంత కీలకమని తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం ఏమాత్రం సహించరాని విషయమని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ సిబ్బంది శాఖ గౌరవ ప్రతిష్టలను కాపాడేలా వృత్తిపరమైన నిబద్ధతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం,క్రమశిక్షణ ఉల్లంఘన లేదా పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు...

నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న ఏఐపీసీ నాయకులు బి.పీ. నాయక్

కాబోయే నూతన వధూవరులకు బి.పీ. నాయక్ ఆశీర్వాదాలు

బోనకల్ నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): బోనకల్ మండల కేంద్రంలోని ఎస్.సి. కాలనీకి చెందిన గత పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ బాబాయి వెంకటేశ్వర్లు కుమార్తె నిశ్చితార్థ వేడుకలో ఏఐపీసీ నాయకులు బీ.పీ. నాయక్ పాల్గొన్నారు. కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ, వారి నూతన జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పరస్పర అన్యోన్యతతో కొనసాగాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు.ఈ వేడుకలో రావినూతల సర్పంచ్ భద్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు తోటపల్లి స్వామి, మధిర మార్కెట్ కమిటీ సభ్యులు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్లలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న అనధికార డిప్యుటేషన్లను రద్దు చేయాలి

డిప్యుటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయుల పూర్తి జాబితాను బహిర్గతం చేయాలి

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవుల



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): కామారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో కొనసాగుతున్న డిప్యుటేషన్ల వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు దేవుల ఆరోపించారు. ఈ విషయంపై శుక్రవారం సాయంత్రం డీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ గిరి, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం ఇచ్చినట్లు దేవుల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అవసరాలకు అనుగుణంగా కాకుండా, కొందరు అధికారుల స్వప్రయోజనాల కోసం ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో వాస్తవంగా ఉన్న ఉపాధ్యాయుల కొరత, సబ్జెక్టుల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా డిప్యుటేషన్లు చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటికే ఈ విషయాన్ని సంబంధిత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిస్థితిలో మార్పు రావడం లేదన్నారు. కొంతమంది మండల విద్యాధికారులు (ఎంఈఓలు) తమకు అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులకు ప్రాధాన్యతనిస్తూ మండల పరిధులు దాటి కూడా డిప్యుటేషన్లు కల్పిస్తున్నారనే సమాచారం తమ దృష్టికి వచ్చిందన్నారు. మరికొన్ని సందర్భాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేరుతో వచ్చిన సిఫారసు లేఖల ఆధారంగా కూడా డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సర్‌ప్లస్‌గా ఉన్న పోస్టుల్లోని ఉపాధ్యాయులను ముందుగా పరిగణనలోకి తీసుకోకుండా, సీనియారిటీతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు చేపడుతున్నారని ఆరోపించారు. అన్ని యాజమాన్యాల పరిధిలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలను, ఎంఈఓలు జారీ చేసిన ఉత్తర్వులతో సహా బహిర్గతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారిని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రస్తుతం డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయుల పూర్తి జాబితాను ప్రకటిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అనధికార డిప్యుటేషన్లన్నింటినీ తక్షణమే రద్దు చేయడంతోపాటు, ఈ వ్యవహారానికి బాధ్యులైన అధికారులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవుల డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు దేవుల తోపాటు ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర కౌన్సిలర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడేది టిడబ్ల్యూజేఎఫ్

రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో కామారెడ్డి జిల్లా ప్రతినిధులు..



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్న ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) అని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాకురి మోహన్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో కామారెడ్డి జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. సంఘం యాక్టివ్ ప్రెసిడెంట్ పిల్లి రామచందర్, రాష్ట్ర కార్యదర్శి బసవపున్నయ్య తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డాకురి మోహన్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం టిడబ్ల్యూజేఎఫ్ నిరంతరం ఉద్యమిస్తోందని తెలిపారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల కేటాయింపు, వృత్తిపరమైన భద్రతతో పాటు వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం సంఘం రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటే వారి పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఐక్యతే హక్కుల సాధనకు ప్రధాన బలమని, ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వచ్చే జనవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న టిడబ్ల్యూజేఎఫ్ మూడవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు, సంఘం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. మహాసభలను ఘనంగా నిర్వహించి జర్నలిస్టుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై బలమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా నుంచి డాకురి మోహన్‌తో పాటు సాయిబాబా పాల్గొన్నారు.

మారుతున్న గ్రామీణ జీవన విధానంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం

ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయాలి

బోనకల్ స్టడీ సర్కిల్‌లో పాఠం బోధించిన కొండేటి అప్పారావు



బోనకల్, నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): బోనకల్ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన స్టడీ సర్కిల్‌లో 'మారుతున్న గ్రామీణ జీవన విధానం -- కమ్యూనిస్టుల ఆవశ్యకత' అనే అంశంపై ఆయన పాఠాన్ని బోధించారు.ఈ సందర్భంగా కొండేటి అప్పారావు మాట్లాడుతూ.. ఒకప్పుడు గ్రామీణ జీవనం ప్రధానంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ వృత్తులు, కులవృత్తులు, పరస్పర సహకారంపై ఆధారపడి ఉండేదని, ప్రస్తుతం కాలానుగుణంగా గ్రామీణ సమాజంలో అనేక మార్పులు వస్తున్నాయని వివరించారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడం, సాగు ఖర్చులు అధికమవడం, పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం, గ్రామీణ ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం వంటి సమస్యలు రైతులు, వ్యవసాయ కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, నిరుద్యోగం, వలసలు, విద్య, వైద్యం వంటి మౌలిక సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక పట్టణాలు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు అప్పులు, పెట్టుబడి భారాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు ఉద్యమం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేయాలని, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, బడుగు బలహీన వర్గాలను ఐక్యం చేసి వారి హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, సమానత్వం, సామాజిక న్యాయం పట్ల అవగాహన కల్పించడం కమ్యూనిస్టుల బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న అసమానతలు, ఆర్థిక దోపిడీ, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచాలని అన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా కమ్యూనిస్టు కార్యకర్తలు కూడా నిరంతరం అధ్యయనం చేయాలని, చరిత్రను, సమకాలీన రాజకీయ, ఆర్థిక పరిణామాలను అర్థం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం, చర్చలు, స్టడీ సర్కిళ్ల ద్వారా సిద్ధాంతపరమైన అవగాహన పెంపొందించుకోవాలని, నేర్చుకున్న విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు.ఈ కార్యక్రమంలో కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, బూర్గుల అప్పచారి, బొప్పాల రమేష్, జొన్నలగడ్డ సునీత, నాగులువంచ కామ్రేడ్ రౌతు అప్పారావు, చామర్తి వెంకటేశ్వర్లు, పొన్నం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రివర్యులు శ్రీ వీవీ పల్లంరాజు

కృషితోనే కాకినాడ కార్పొరేషన్ అభివృద్ధి చెందింది

కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి& జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివగణేష్



కాకినాడ జిల్లా జగ్గంపేట నవంబర్ 22: (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కళా వెంకటరావు భవన్ నందు కేంద్ర మాజీ మంత్రివర్యులు శ్రీ మల్లిపూడి మంగపతి పల్లంరాజు ఆదేశాలు మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు చెక్క నూకరాజు, కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లా అధికార ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివగణేష్ మీడియాతో మాట్లాడుతూ... కాకినాడ నగర కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి కట్టా పద్మజ ను హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించవలసిన ఆవశ్యకతను వివరిస్తూ... కాకినాడ నగర అభివృద్ధి కేంద్ర మాజీ మంత్రివర్యులు డాక్టర్ వీవీ పల్లంరాజు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా మాత్రమే జరిగిందని శివ గణేష్ అన్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం సముద్ర తీరంలో 300 కోట్ల రూపాయల వ్యయంతో ××× విద్యా సంస్థను మంజూరు చేయించింది, 250 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో ఇంటర్ యూనివర్సిటీ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ ను జీటీఖఖ అనుసంధానంగా మంజూరు చేయించింది, జడీూఱు అనుసంధానంగా టీచింగ్ ఎడ్యుకేషన్ ను కాకినాడకు మంజూరు చేయించింది, కేంద్రీయ విద్యా సంస్థ ను కాకినాడకు మంజూరు చేయించింది, కాకినాడ పోర్ట్ అభివృద్ధికి& రక్షణకు కోస్ట్ గార్డ్ హార్బర్ ను నిర్మాణం చేయించింది వాయు జల వాహనములను ఏర్పాటు చేయించింది, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను మంజూరు చేయించింది....కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ మల్లిపూడి మంగపతి పల్లంరాజు అని శివ గణేష్ గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు, ఏలేరు ప్రాజెక్టు లతో కాకినాడ జిల్లా మరియు కార్పొరేషన్ కు అవినాభావ సంబంధం ఉందని, రాష్ట్ర విభజనలో భాగంగా పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్రానికి బహుకరించిందని, ఏలేరు రిజర్వాయర్ కు మూడు దఫాలుగా వందల కోట్ల రూపాయల నిధులను శ్రీ వీవీ పల్లంరాజు మంజూరు చేయించారని, అదే ఏలూరు జలాశయం నుండి నేడు కాకినాడ పట్టణానికి 400 కోట్ల రూపాయలతో కేంద్ర మంచినీటి పథకం జల జీవన మిషన్ ద్వారా తీసుకువచ్చే దానికి ప్రయత్నం చేస్తున్నారని శివ గణేష్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర విభజన సహకారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా అమలు చేయాలని కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దాని ద్వారా ఐదు లక్షల కోట్ల రూపాయలు లబ్ధి ఆంధ్ర రాష్ట్రానికి జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేసిందని శివ గణేష్ అన్నారు. చిత్తూరు జిల్లాకు చెన్నై నగరం, కర్నూలు జిల్లాకు హైదరాబాద్, అనంతపురం కడప జిల్లాలకు బెంగళూరు దగ్గరలో ఉండడం వల్ల ఆయా ప్రాంతాల్లోని ప్రజలు విద్యావంతులుగా తీర్చిదిద్దబడడానికి అవకాశం కలిగిందని, కాబట్టి ఆ ప్రాంత ప్రజలే ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలించేదానికి అవకాశం కలిగిందని... ఆంధ్ర ప్రాంతంలో కూడా కాకినాడలో విద్యాసంస్థలను బలోపేతం చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందుతారని వీవీ పల్లంరాజు ఆలోచన చేసి కాకినాడ పట్టణానికి అనేక విద్యాసంస్థలను తీసుకువచ్చే దానికి ప్రయత్నం చేశారని... కావున హస్తం గుర్తుపై తమ పవిత్రమైన ఓటు ముద్ర వేసి కాకినాడ నగర మేయర్గా కట్టా పద్మజ గార్ని గెలిపించవలసిందిగా శివ గణేష్ కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు చెక్క నూకరాజులు మాట్లాడుతూ ... గత కాంగ్రెస్ పరిపాలనలో కాకినాడ కార్పొరేషన్ లో ప్రజలకు జరిగిన మేలును గుర్తించి కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి కట్టా పద్మజను హస్తం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మట్ట శివప్రసాద్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నక్క సత్యనారాయణ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహా స్వామీ కళ్యాణం





వలిగొండ నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహా స్వామీ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ స్వామివారి తిరు కళ్యాణం అంగరంగ వైభవంగా వేద మంత్రోచారణల మధ్య కళ్యాణం భక్తుల కనుల పండువగా వేద పండితులు శాస్తరోక్తంగా నిర్వహించారు. ఈ కళ్యానానికి పట్టు వస్త్రాలు, తలబ్రాలు ఆలయ కార్యనిర్వాహన అధికారి కొత్తపల్లి వెంకటయ్య దంపతులు, చైర్మెన్ తుమ్మల శ్రీనివాస్ దంపతులు సమర్పించారు. హయత్ నగర్ నీలాద్రి ఆరుద్ర ఆసుపత్రికి చెందిన పిసాటి రేణుక శ్రీనివాస్ రెడ్డి ల కుమారులు జితేందర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి ల సౌజన్యంతో భక్తులకు అన్నదాన కార్యమాన్ని నిర్వహించారు. కళ్యాణానికి ముఖ్య అతిధిగా స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు ఆలయ పండితులు పూర్ణ కుంభం తొ స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో నూతన అన్న సత్రానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్నెకంటి కలమ్మ యాదయ్య, కుంభం వెంకట పాపిరెడ్డి, గరిసే రవి, గూడూరు శివశంత్ రెడ్డి, బత్తిని సహదేవ, జక్క జంగారెడ్డి,సుక్కముత్యాలు, బుర్ర నర్సింహా, పోలేపాక జానకిరాములు, చిలుగూరి సత్తిరెడ్డి, వెంకటేశం, చెరుకు శివ్వయ్య, పలుసం సతీష్ గౌడ్,ఆలయ ధర్మకర్తలు,వేద పండితులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఎలిమినేటికి జన్మదిన శుభాకాంక్షలు

చింతల వెంకటేశ్వర్ రెడ్డి

కృష్ణారెడ్డి నిండు నూరేళ్లు జీవించాలి





యాదాద్రి భువనగిరి నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): భువనగిరి పట్టణంలో మాజీ ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి 90వ జన్మదినాన్ని పురస్కరించుకుని, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి, స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ, ఎలిమినేటి కృష్ణారెడ్డికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.వారి వెంట బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మదారం రాము కుమార్, పార్టీ జిల్లా నాయకులు కుతాడి సురేష్,దండబోయిన బాలరాజు యాదవ్,కట్కూరి నరేష్, మోతె మనోహర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 4 చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం



తొర్రూర్, నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): తొర్రూరు కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో మొత్తం 4 చెక్ బౌన్స్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా రూ.6,50,000 సెటిల్‌మెంట్ జరిగినట్లు జూనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ ధీరజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని, ఇరుపక్షాల వారు పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి. రత్నం, అడ్వకేట్ కుమార్, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ సిరులు అధికం



తొర్రూర్, నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): తొర్రూరు మండలంలో రైతులు లాభదాయకమైన వాణిజ్య పంటల వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా పామాయిల్ సాగులో ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. సాధారణ పంటలతో పోలిస్తే పామాయిల్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందిస్తోంది. సాధారణ పంటలతో పోలిస్తే పామాయిల్ సాగు రైతులకు ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు అందుతున్నాయి. సాగు ప్రారంభంలో కొంత పెట్టుబడి అవసరమైనప్పటికీ, క్రమంగా నిర్వహణ భారం తగ్గుతుంది. అంతేకాకుండా ఇతర పంటలతో పోలిస్తే పామాయిల్ సాగుకు తక్కువ నీరు సరిపోతుందని రైతులు భావిస్తున్నారు. పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ, మరింత మంది రైతులు ఈ సాగు వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు.. రైతుల ఆందోళన



తొర్రూర్, నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): తొర్రూరు మండలంలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటివరకు కొన్ని గ్రామాల్లో మాత్రమే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు గతంలో క్వింటాల్‌కు రూ.3,500 ధర చెబుతూ ప్రస్తుతం ధర తగ్గించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, మండలంలోని అన్ని గ్రామాల్లో వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సహజ ప్రసవం తల్లీబిడ్డల ఆరోగ్యానికి రక్ష!

సహజ ప్రసవం కోసం

హన్మకొండలో ఘనంగా వాక్ నిర్వహణ



నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్, ఇండియా (ఎస్ ఓ ఎం ఐ), ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, హన్మకొండ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హన్మకొండలో సహజ ప్రసవం కోసం దేశవ్యాప్త నడక (నేషనల్ వైడ్ వాక్ ఫర్ నాచురల్ బర్తింగ్ నిర్వహించారు. ఈ నడకను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్,ఎన్. శ్వేత,పోలీస్ కమిషనర్, జెండా ఊపి ప్రారంభించారు. 700 మంది నర్సింగ్ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని సహజ ప్రసవం, సురక్షిత మాతృత్వం, మిడ్‌వైవ్స్ పాత్ర గురించి నినాదాలు చేస్తూ, ప్లకార్డులతో నడక సాగించారు. ఈ సందర్భంగా సీపీ, కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అభినందించారు. సహజ,సాధారణ ప్రసవాన్ని ప్రోత్సహించడం, అనవసర సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం,ప్రతి తల్లికి మిడ్‌వైఫరీ నేతృత్వంలోని సంరక్షణను బలోపేతం చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గర్భిణీ స్త్రీలు వారి కుటుంబాలలో సురక్షితమైన, గౌరవప్రదమైన సహజ ప్రసవం పట్ల విశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నడక సందర్భంగా విద్యార్థులు సాధారణ ప్రజలకు సహజ ప్రసవం గురించి అవగాహన కల్పించే కరపత్రాలను పంపిణీ చేశారు. సహజ ప్రసవం వల్ల కలిగే ప్రయోజనాలు, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సురక్షిత మాతృత్వం గురించి ప్రజలకు వివరించారు. కేయంసి ఆర్చ్ నుండి ప్రారంభమై జీయంహెచ్ హాస్పిటల్, హన్మకొండ వరకు జరిగిన ఈ వాక్ లో సహజ ప్రసవాన్ని ప్రోత్సహించడం,ప్రతి తల్లికి కరుణతో కూడిన మిడ్‌వైఫరీ సంరక్షణ అందించడం, అందరికీ సురక్షిత మాతృత్వం కోసం కృషి చేయడం అనే ప్రతిజ్ఞతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో వాక్ కో-ఆర్డినేటర్ బి. సువత్సల, ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, హన్మకొండ.డా. ఎ. అప్పయ్య, డియంహెచ్ఓ బి. సువత్సల, ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, అధ్యాపకులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల,హన్మకొండ ,మేధా నర్సింగ్ కళాశాల, బాలాజీ నర్సింగ్ కళాశాల, ప్రశాంతి నర్సింగ్ కళాశాల, జయ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్,వాగ్దేవి డిగ్రీ కళాశాల, కాకతీయ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, హన్మకొండ ప్రిన్సిపాల్,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వై డి ఏ ఏ అధ్యక్షుడిగా పోతంశెట్టి వెంకటేశ్వర్లు

జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడను మరింత అభివృద్ధి చేస్తాం

క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళతాం

యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ (వై డి ఏ ఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా మున్సిపల్ మాజీ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కోనేటి గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం భువనగిరిలోని పెన్షనర్స్ భవన్‌లో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిబంధనలకు అనుగుణంగా, 2026--2030 కాలానికి గాను నూతన ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులను ఎన్నికల అధికారి, అడ్వకేట్ బి. నరేష్ అధికారికంగా ప్రకటించారు. ?ఈ ఎన్నికల ప్రక్రియకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డి .ఎస్.ఏ) యాదాద్రి భువనగిరి పరిశీలకులు టి. జానకిరాములు, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ పరిశీలకులు కర్రోళ్ల వెంకటస్వామీ హాజరై ఎన్నికలను పర్యవేక్షించారు.

నూతన కార్యవర్గం..

అధ్యక్షులుగా పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ?ఉపాధ్యక్షులుగా



కె. వెంకట రమణ, ఎం. వినోద్,

ఇ. శిరీష, టి. ఉపేందర్

ప్రధాన కార్యదర్శిగా కోనేటి గోపాల్, ?కోశాధికారి గోనూరు శ్రీనివాస్, ?సంయుక్త కార్యదర్శులుగా ఎ. అనిల్ కుమార్, ఆర్. వీరేశం, ఆర్. జ్యోతి, జి. సునీల్, ఎన్నికయ్యారు.

కార్యవర్గ సభ్యులు..

టి. కోటేశ్వర రావు, పి. అనిత, జె. రామకృష్ణ,కె. హైమావతి, ఎం.డి. కబీరుద్దీన్, ఎ. మహేష్, జి. సాయి సచిన్,



ఐ. సునీత, ఇ. ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్ మాట్లాడుతూ, జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడను మరింత అభివృద్ధి చేయడానికి, క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

31వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

18 నుంచి 59 సంవత్సరాలు వారు అర్హులు

ఎమ్మెల్యే కుంభం సహకారంతో అభివృద్ధిలో ముందుకు

యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): భువనగిరి పట్టణంలోని 31వ వార్డు బంజారాహిల్స్ ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ మాట్లాడుతూ, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కుటుంబంలో సంపాదించే వ్యక్తి దురదృష్టవశాత్తూ మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా



పరిహారం అందుతుందని వివరించారు.

పథకం ముఖ్య ఉద్దేశాలు..

ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడం, కుటుంబ పెద్ద మరణించి నప్పుడు ఆర్థిక భరోసా అందించడం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడం. అర్హులైన కుటుంబాలకు బీమా సదుపాయం అందించడం. బీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ బీమా పొందటానికి రేషన్ కార్డు కలిగిన కుటుంబంలో ఒకరికి మాత్రమే బీమా సదుపాయం ఉంటుందని, బీమా పొందే వ్యక్తి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర వివరాలు సమర్పించాలన్నారు. బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీకి రూ.5 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, 31వ వార్డులోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో నమోదు చేసుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారి పొట్ట శ్రీనివాస్, ఆపరేటర్ మహేశ్వరి, ఏరియా సూపర్వైజర్ ప్రశాంతి, చిత్రమ్ నరేష్, బానోతు సంతోష్ నాయక్, బానోత్ జ్యోతి, భార్గవ్, అనూష, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

స్వర్ణ గిరిలో అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనం

వైభవ మంటపంలో సత్య నారాయణ వ్రతం

అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం

ఆలయ ధ్వజస్తంభమునకు మోక్ష నారాయణ దీపం

వైభవంగా జరిగిన శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవం

శ్రీవారి మహోన్న ప్రసాదాన్ని స్వీకరించిన 3000 మంది భక్తులు

నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్న భక్తులు

యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం ఆలయంలోని అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనము నిర్వహించారు. అనంతరం వైభవ మంటపంలో సత్య నారాయణ వ్రతం నిర్వహించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో







అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశు లైనారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఆదివారం 3000 మంది భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం సంధ్య వేళ ఆలయ ధ్వజస్తంభమునకు మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు. ఆదిమధ్యాంత రహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకుఎ దర్శనమిచ్చారు.అర్చక స్వాములు వేదమంత్రోచ్చార ణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.

మైనారిటీల ఓటు హక్కులను హరించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలి

బీజేపీ విధానాలతో మైనారిటీల హక్కులకు ముప్పు

ఐక్యంగా పోరాడాలి

లౌకికవాదానికి, మత సామరస్యానికి కాంగ్రెస్ అండగా ఉంటుంది

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): మైనారిటీల ఓటు హక్కులను తొలగించి, వారిని ఈ దేశ పౌరులుగా కాకుండా పరాయివారిగా చిత్రీకరించే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, మైనారిటీల హక్కుల పరిరక్షణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముస్లిం మైనారిటీలు, మేధావులు సమాజంలో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎక్కడ భంగం కలిగినా పార్టీలకతీతంగా ఐక్యంగా నిలబడి ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాలని స్పష్టం చేశారు. మైనారిటీస్ ఇంటలెక్చువల్ ఫోరం (ఎంఐఎఫ్) ఆధ్వర్యంలో ములుగు రోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఉచిత మహిళా టైలరింగ్ శిక్షణ కేంద్రం 10వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన సర్టిఫికెట్లు, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా కడియం కావ్య మాట్లాడుతూ మహిళలు ఎవరి మీదా ఆధారపడకుండా స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలని అన్నారు. మైనారిటీ మహిళలకు ఉపాధి నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో పదో బ్యాచ్ వరకు నిరంతరాయంగా ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన మహిళలు తక్కువ సమయంలోనే కుట్టుపనిలో మంచి ప్రావీణ్యం సంపాదించడం వారి పట్టుదలకు, నేర్చుకోవాలనే ఆసక్తికి నిదర్శనమని ప్రశంసించారు. ఈ నైపుణ్యంతో సొంతంగా ఉపాధి పొందడమే కాకుండా, బోటిక్‌లు, ఇతర సంస్థలకు కూడా సేవలందిస్తూ ఆదాయం సంపాదించవచ్చని సూచించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, అవసరమైన సమయంలో మహిళలు కూడా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని అన్నారు. ఇంటి బాధ్యతలను నిర్వర్తిస్తూనే కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడానికి సమయం కేటాయించడం సాధారణ విషయం కాదని, శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి మహిళను అభినందిస్తున్నానని



తెలిపారు. మైనారిటీస్ ఇంటలెక్చువల్ ఫోరం తన సేవలను కేవలం నైపుణ్య శిక్షణకే పరిమితం చేయకుండా పేద మైనారిటీ విద్యార్థుల విద్యాభివృద్ధికి కూడా విస్తరించాలని ఎంపీ కోరారు. ముస్లిం బాలికలు చదువులో ప్రతిభ కనబరుస్తున్నారని, మంచి మార్కులు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలిచి, ఉన్నత విద్య, నీట్ వంటి పోటీ పరీక్షలపై అవగాహన, కౌన్సెలింగ్, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక సమయంలో అందించే సహాయం వారి జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజలమంతా తమ హక్కుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.మైనారిటీ ప్రజలను ఈ దేశానికి చెందినవారు కాదన్నట్లుగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చిత్రీకరిస్తుందని విమర్శించారు. ఓటరు జాబితాల నుంచి మైనారిటీల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరిగితే వారి ఓటు హక్కుతో పాటు ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యమయ్యే అవకాశాలు కూడా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కు కోల్పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ గొంతును వినిపించే అవకాశం తగ్గడమే కాకుండా,ప్రభుత్వ పథకాలు,సంక్షేమ ప్రయోజనాలు పొందే విషయంలోనూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్ల ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, అర్హులైన వారందరి ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. ఈ అంశంపై ముస్లిం సోదర, సోదరీమణుల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత మేధావులు, సామాజిక సంస్థలపై ఉందన్నారు. లౌకికవాదం,మత సామరస్యం, అన్ని మతాల ప్రజల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. మైనారిటీలు ఎదుర్కొనే సమస్యలపై ఐక్యంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో గొంతెత్తాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచి ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన మహిళలకు ఎంపీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.గృహ బాధ్యతలను నిర్వర్తిస్తూనే శిక్షణ కోసం సమయం కేటాయించి,కొత్త నైపుణ్యాన్ని నేర్చుకున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఈ కార్యక్రమానిక మైనారిటీస్ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్ధిఖీ, కార్యదర్శి ఎం.ఏ. కలీం,వ్యాపారవేత్త మహ్మద్ అలీ, కన్వీనర్ మషూక్ రబ్బానీ, జర్నలిస్ట్ ఎం.ఏ.నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కలల సౌధం లబ్ధిదారుల కన్నీటి గోడు

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుండెల్లో అప్పుల కుంపటి
- గృహప్రవేశం మరుసటి రోజే ఇంటి ముందు వడ్డీ వ్యాపారుల క్యూ
- రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షలు
- రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు
- నియోజకవర్గానికి 3,600 చొప్పున నిరుపేదలకు కేటాయింపు
- చేతిలో చిల్లిగవ్వ లేక నూటికి రూ. 5 నుంచి రూ. 10 వడ్డీకి అప్పులు
- ఆకాశాన్నంటిన నిర్మాణ వ్యయం
- ఏ దశలోనూ సరిపోని ప్రభుత్వ సాయం
- ప్రభుత్వ ఇల్లు కావడంతో అమ్ముకోలేని నిస్సహాయత
- అప్పుల బాధతో ఆత్మహత్యలే శరణ్యమంటున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు



నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): సొంత స్థలం ఉండి, ఆర్థిక స్థోమత లేక గుడిసెల్లో, అద్దె ఇళ్లలో మగ్గుతున్న నిరుపేదల కళ్లలో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4,50,000 ఇళ్లు, రెండో విడతలో 2,50,000 ఇళ్లు కలిపి మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ప్రతి నియోజకవర్గానికి 3,600 ఇళ్ల చొప్పున కేటాయించి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. అయితే, పేదల సొంతింటి కలను సాకారం చేయాల్సిన ఈ పథకం, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పెరిగిన నిర్మాణ వ్యయానికి, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం రోజున ఎవరో ఒకరు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, లేదా స్థానిక ప్రజా నాయకులు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి వారికి నూతన వస్త్రాలు పెట్టి, చూసావా మా ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చింది అని గొప్పగా చెప్పి ఫోటోలు దిగి వచ్చేస్తున్నారు కానీ మొత్తం ఇల్లు పూర్తి అయ్యేసరికి ఎంత ఖర్చు అయిందని మాత్రం అడగటం లేదు. ప్రభుత్వం ఇస్తున్న నిధులకు పొంతన లేకపోవడంతో నిరుపేదలు అప్పుల ఊబిలో కూరుకు పోయి విలవిలలాడు తున్నారు.

పునాది నుంచే వడ్డీ వ్యాపారుల ఉచ్చులోకి

అసలు పేదవాడు కాబట్టే ప్రభుత్వం వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. కానీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా ఇంటి నిర్మాణం పూర్తి చేయకపోతే మంజూరు రద్దవుతుందనే భయం లబ్ధిదారులను వెంటాడుతోంది. నిబంధనల ప్రకారం ముందుగా లబ్ధిదారుడు సొంత ఖర్చులతో పునాదులు తీసి, బేస్మెంట్ నిర్మించి, పిల్లర్లు లేపాలి. రెక్కాడితే కానీ డొక్కాడని పేదల దగ్గర అంత పెద్ద మొత్తంలో నగదు ఉండే అవకాశమే లేదు. ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇస్తుంది కదా, ఎలాగోలా ఇల్లు పూర్తవుతుంది అనే ఆశతో లబ్ధిదారులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నూటికి రూ. 5 నుంచి రూ. 10 వరకు అధిక వడ్డీకి రూ. 1.50 లక్షల వరకు అప్పులు తెచ్చి బేస్మెంట్, పిల్లర్ల వరకు పనులు పూర్తి చేస్తున్నారు. ఆ తర్వాతే ప్రభుత్వం మొదటి విడతగా రూ. 1,00,000 మంజూరు చేస్తోంది. అప్పటికే తెచ్చిన అప్పుకు వడ్డీలు తడిసి మోపెడవడంతో, చేతికి వచ్చిన లక్ష రూపాయలు ఎటూ సరిపోని పరిస్థితి నెలకొంది.

దశలవారీ బిల్లులు పెరుగుతున్న ఆర్థిక భారం

ప్రభుత్వం రూ. 5 లక్షలను నాలుగు దశల్లో విడుదల చేస్తోంది. కానీ, ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఇసుక, ఇటుక, సిమెంట్, స్టీల్, మేస్త్రీ కూలీల ధరలు ఆకాశాన్ని తాకడంతో ఏ దశలోనూ ప్రభుత్వ సాయం సరిపోవడం లేదు.. మొదటి దశ పునాదులు, బేస్మెంట్, పిల్లర్లు రూ. 1.50 లక్షల వరకు ఖర్చవుతోంది. అంటే ముందే రూ. 50 వేల లోటు. రెండో దశ సజ్జల (లెంటల్ లెవల్) వరకు గోడలు రూ. 1,00,000. ఇటుకలు, సిమెంట్, కూలీల ఖర్చులకు లక్ష రూపాయలు ఏమాత్రం చాలడం లేదు.మూడో దశ ఇంటి స్లాబ్ నిర్మాణం రూ. 2,00,000 ఈ ఒక్క దశలో మాత్రమే ఇచ్చే డబ్బులు స్లాబ్ ఖర్చులకు కొంతవరకు సరిపోతున్నాయి. నాలుగో దశ గృహప్రవేశం సమయంలో రూ. 1,00,000 ప్రభుత్వం ఇస్తుంది. కానీ ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, బాత్రూమ్, ప్లంబింగ్ పనులకు 2.5 లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయి.

అసంపూర్తి పనులు ఆర్థిక భారంతో ఉక్కిరిబిక్కిరి..

స్లాబ్ పడిన తర్వాత ఇంటికి ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలతో పాటు అత్యవస రమైన బాత్రూమ్ నిర్మాణం, ప్లంబింగ్ పైపులు, ఎలక్ట్రికల్ వైరింగ్ వంటి పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ భారీగా ఖర్చవుతుంది. ప్రభుత్వం ఇచ్చే రూ. 5 లక్షలతో పాటు, లబ్ధిదారులు బయట నుంచి అదనంగా మరో రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు అప్పులు చేస్తే తప్ప ఇల్లు నివాసయోగ్యంగా మారదం లేదు.

గృహప్రవేశం తెల్లారే ఇంటి ముందు అప్పులవాళ్ల పంచాయితీ..

ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, అప్పులు చేసి గృహప్రవేశం చేసిన ఆనందం లబ్ధిదారులకు ఒక్క రోజు కూడా నిలవడం లేదు. గృహప్రవేశం జరిగిన మరుసటి రోజు ఉదయమే వడ్డీ వ్యాపారులు, అప్పులిచ్చిన వారు వచ్చి కొత్త ఇంటి ముందు కూర్చుంటున్నారు. అసలు, వడ్డీ కలిపి తక్షణమే చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు.సొంత ఇల్లు కట్టుకున్నామని సంతోష పడాలో, అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక ప్రాణాలు తీసుకోవాలో అర్థం కావడం లేదు అని లబ్ధిదారులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అమ్ముకోలేని నిస్సహాయత..

అప్పు తీర్చడానికి మరో అప్పు..

సాధారణంగా అప్పుల బాధ ఎక్కువైతే ఉన్న ఆస్తిని అమ్ముకుని అప్పులు తీర్చుకుంటారు. కానీ, ఇది ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు కావడంతో నిబంధనల ప్రకారం ఇతరులకు విక్రయించడానికి వీల్లేదు. ఇటు ఇల్లు అమ్ముకోలేక, అటు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక లబ్ధిదారులు నరకయాతన అనుభవిస్తు న్నారు. మొదటి అప్పు తీర్చడానికి మళ్లీ ఎక్కడో ఒకచోట అధిక వడ్డీకి మరో అప్పు తేవాల్సిన దుస్థితి ఏర్పడింది. చివరకు అప్పులు తీర్చే మార్గం లేక కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యమా అన్నంత తీవ్రమైన మానసిక వేదనలోకి నిరుపేద కుటుంబాలువెళ్లిపోతున్నాయి.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి..

నిర్మాణ పనులు మొదలుపెట్టకముందే ప్రభుత్వం కనీసం రూ. 1 లక్ష అడ్వాన్స్ రూపంలో అందిస్తే తప్ప పేదలు వడ్డీ వ్యాపారుల ఉచ్చులో పడకుండా ఉండలేరు. అలాగే, పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణ వ్యయాన్ని కనీసం రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని, బిల్లుల విడుదలలో నిబంధనలు సడలించాలని లబ్ధిదారులు, ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాయి.

పేదవాడి కలను అప్పుల కుంపటిగా మార్చొద్దు..

రోజువారీ కూలీ చేసుకుని బతికే మాకు లక్షల రూపాయలు ఎక్కడి నుంచి వస్తాయి? పునాదుల కోసం నూటికి రూ. 5 నుంచిరూ.10 వడ్డీకి అప్పు తెచ్చాను. ఇల్లు పూర్తయ్యేసరికి రూ. 4 లక్షల అప్పు మిగిలింది. గృహప్రవేశం అయిన తెల్లారే అప్పులవాళ్లు ఇంటి ముందు కూర్చుంటు న్నారు. ఈ ఇల్లు అమ్ముకునే అధికారం మాకు లేదు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక రాత్రంతా నిద్ర పట్టడం లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇందిరమ్మ ఇళ్లకు మరో 5 లక్షల రూపాయలు, అంటే మొత్తం 10 లక్షల రూపాయలు కేటాయించాలని లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

కమలాపూర్‌లో 96.43% పూర్తితో
విజయవంతమైన పల్స్ పోలియో




కమలాపూర్ నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, కమలాపూర్ పీహెచ్‌సీలో గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్‌తో కలిసి డాక్టర్ రోహిత్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి శ్రీకారం చుట్టారు.

పర్యవేక్షించిన డీఎంహెచ్‌వో

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, మాదన్నపేట, శనిగరం గ్రామాలను సందర్శించి పోలియో చుక్కల పంపిణీ తీరును పర్యవేక్షించారు. లక్ష్యాన్ని చేరుకునేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

లక్ష్యం 4,422.. పంపిణీ 4,264

పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులు 4,422 మందికి పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, 4,264 మందికి చుక్కలు వేసి 96.43 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యులు డాక్టర్ అరుణ్, డాక్టర్ మానస, డాక్టర్ మాధవి, డాక్టర్ రమ్య, హెచ్‌ఈఓ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్లు అమృత, వెంకటరమణారెడ్డి, ప్రభాకర్, స్టాఫ్ నర్సులు శాలిని, ప్రమీల, సరిత, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రమోహన్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సిబ్బంది, ప్రజాప్రతినిధులకు అధికారులు అభినందనలు తెలిపారు.

ఆంగ్ల భాషా ప్రతిభా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విజేతలకు అభినందనలు తెలిపిన ఎంఈఓ కొమురయ్య



రామగిరి నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): రామగిరి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మండల స్థాయిలో ఆంగ్ల భాషా ప్రతిభా పోటీలు నిర్వహించగా విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. తెలంగాణ విద్యా అభ్యసన ప్రతిభా సాధన సంస్థ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఈ పోటీల్లో రామగిరి మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల వారీగా ఉపన్యాస, ఆంగ్ల భాషా ఒలింపియాడ్ పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీల సీనియర్ విభాగంలో వెంకట్రావుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఈ. సహస్ర మొదటి స్థానం సాధించగా, రామగిరి కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన కె. సాయివల్లిక్ ప్రతిభ కనబరిచారు. జూనియర్ విభాగంలో వెంకట్రావుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఈ. ప్రణీత మొదటి స్థానం సాధించగా, కల్వచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ. లాస్య ప్రతిభ చాటారు. ఆంగ్ల భాషా ఒలింపియాడ్ సీనియర్ విభాగంలో వెంకట్రావుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. సిద్ధార్థ, బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కె. రంజిత్ కుమార్ విజయం సాధించారు. జూనియర్ విభాగంలో వెంకట్రావుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.డి. అఫాన్, రామగిరి కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన జె. ఆరాధ్య ప్రతిభ కనబరిచారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం, విజేతలు తమ ప్రతిభను చాటుకోవడం పట్ల మండల విద్యాధికారి ఎనగందుల కొమురయ్య హర్షం వ్యక్తం చేశారు. విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం, పోటీతత్వం పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈనెల 29న చలో జనగామ కార్యక్రమానికి జయప్రదం చేయండి

ఎల్ హెచ్ పి ఎస్ వ్యవస్థాపక సభ్యుడు జాటోత్ బాలు నాయక్ పిలుపు

తొర్రూర్ నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): మహబూబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని ఈ నెల 29న చలో జనగాం కరపత్రం మండలంలో అమర్ సింగ్ తండాలో ఆవిష్కరించడం జరిగింది ఈసందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక సభ్యులు జాటోత్ బాలునాయక్ మాట్లాడుతూ. లంబాడి సమాజం ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు సాధించేవరకు. రాజ్యాంగ బంధమైన హక్కులను పరీక్షించేందుకు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు. మేధావులు. యువత. ఉద్యోగులు. ప్రజాసంఘాల ప్రతినిధులను అన్ని ఒకే వేదికపై తీసుకువచ్చే లక్ష్యంతోనే ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అభివర్ణించారు. ఇది కేవలం సమావేశం మాత్రమే కాదు. లంబాడి సమాజం భవిష్యత్తును నిర్ణయించే హక్కుల పోరాటానికి ఒక దిశ నిర్దేశం. మన సమస్యలపై చర్చించి ఆగిపోవడం కాదు. పరిష్కారం కోసం ఐక్య కార్యచరణకు శ్రీకారం చుట్టడమే మన లక్ష్యం మన సంకల్పం. అని బాలు నాయక్ అన్నారు. తండాలకు స్వయం ప్రతిపత్తి. సమగ్ర అభివృద్ధి. అర్హత కలిగిన తండాలను రెవెన్యూ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. తండాల సమ్మె గ్రహ అభివృద్ధి.



మౌలిక సదుపాయాలు. నిధులు కేటాయింపు పరిరక్షణ కోసం ప్రత్యేక తండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టిలకు ప్రస్తుతము అమ్ములో ఉన్న 10 శాతం రిజర్వేషన్ కు మరింత బలమైన రాజ్యాంగపరమైన రక్షణ కల్పించేందుకు. చట్టపరమైన సాధ్యతను పరిశీలించి తొమ్మిదవ షెడ్యూల్లో చర్చి ఎందుకు కేంద్ర ప్రభుత్వం చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ఉద్యోగాలకు పదోన్నతులో రిజర్వేషన్ కల్పించే అవకాశాన్ని చట్టపరంగా పరిశీలించి. రాజ్యాంగ నిబంధనలు కనుగుణంగా అమలు చేయాలి. గిరిజన ఉద్యోగాలపై కక్షపూరిత చర్యలు అరికట్టి. వారి హక్కుల. నాగపరమైన అవకాశాలను పరీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షుడు జాటోత్ బిచ్చ నాయక్. జాటోత్ మోహనా నాయక్. గూగుల్లో వెంకటేష్ నాయక్ వెంకన్న నాయక్ మంగ్యా నాయక్ బిక్కు నాయక్ బుజ్జి కౌసల్య శెట్టి తదితరులు పాల్గొన్నారు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినంగా అమలు చేయాలి

చంద్రుగొండ ఫారెస్ట్ రేంజర్ కే తేజస్వీ చలమల శ్రీనివాసరావు నాలుగో వర్ధంతి సందర్భంగా నివాళులు ఎర్రబోడులో స్మారక స్థూపం వద్ద ఫారెస్ట్ అధికారులు ఘనంగా నివాళులు

చంద్రుగొండ నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): ఫారెస్ట్ రేంజర్ చలమల శ్రీనివాసరావు ఆశయ స్ఫూర్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి కే తేజస్వీ అన్నారు. ఆదివారం చలమల శ్రీనివాసరావు నాలుగో వర్ధంతి పునస్మరించుకొని బెండాలపాడు గ్రామ శివారు ఎర్రబోడు అడవి ప్రాంతంలో ఉన్న చలమల శ్రీనివాసరావు స్మృతి వనంలో ఏర్పాటు చేసిన స్మారక స్థూపం వద్ద అటవీశాఖ అధికారులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేంజర్ కే తేజస్వీ మాట్లాడుతూ... చెట్లే ప్రాణంగా బతికిన అధికారి చలమల శ్రీనివాసరావు అన్నారు. అటవీ సంపదను కాపాడే క్రమంలో వలస గొత్తి కోయల చేతిలో దారుణ హత్యకు గురి కావడం, నేటికీ మేము జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. ఏదైతే మొక్కలను కాపాడి తన ప్రాణాలను సైతం వదిలిన ప్రదేశాన్ని, ప్రతిరోజు అటవీ సిబ్బంది పరిశీలించి మొక్కలను కాపాడి భారీ వృక్షాలుగా తీర్చిదిద్ది ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడవి సిబ్బందిపై దాడులు జరగకుండా చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాలన్నారు. అటవీ సంపదను కాపాడుకునే క్రమంలో ఏదైనా జరగరాని ఘటన జరిగితే వెంటనే అధికారులు, సిబ్బంది, వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకునే విధంగా ఒకరికొకరు తోడ్పాటు అందించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో మన పిల్లలను స్మృతి వనాన్ని తీసుకువచ్చి అక్కడి పచ్చని అడవిని చూపిస్తూ ఈ అడవి కోసం శ్రీనివాసరావు ప్రాణాలు అర్పించారని, ఆయన స్ఫూర్తితో మేమంతా కలిసి దీనిని కాపాడుకున్నాం అని చెప్పగలిగితే అదే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళులు అని అన్నారు. కావున అడవులను సంరక్షించుకోవడం మన అందరి బాధ్యతగా తీసుకొని రాబోయే తరాలకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్లు కే లక్ష్మీపతి, ఎస్.కె నాసర్ బీ, సెక్షన్ ఆఫీసర్ కే శివకుమార్, బీట్ ఆఫీసర్ నరసింహారావు, అలాగే అటువైపు సిబ్బంది, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



టి ఎస్ కే రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం

శాసనసభాపతి చేతులు మీదుగా ప్రారంభం

రెస్టారెంట్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్య అతిథులు






యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): హైదరాబాద్‌లోని నాగోల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టి ఎస్ కే (తెలంగాణ స్పైస్ కిచెన్) రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చిన్న అల్లుడు మందాడి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌ను తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా రెస్టారెంట్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేసి, టి ఎస్ కె రెస్టారెంట్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ ప్రజాప్రతిని ధులు, నాయకులు పాల్గొ న్నారు.

కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి
ఆశయాలను కొనసాగిస్తాం- సిపిఐ



వలిగొండ నవంబర్ 22 (ప్రభాత కిరణమ్ న్యూస్): తెలంగాణ రైతాంగ పోరాట వీరుడు, రామన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు గుర్రం యాదగిరి రెడ్డి 7వ వర్ధంతి వలిగొండ మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి మాట్లాడుతూ కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని ఆయన అన్నారు. యాదగిరిరెడ్డి భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన పోరాటంలో ముందుండి నడిచారని, రజాకార్లు, జమీందారులు, జాగిర్దారులు ప్రజలపై చేస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని సాయుధ దళాల నిర్మాణంలో ముందుండి నడిచిన యోధుడని ఆయన అన్నారు. రామన్నపేట నియోజకవర్గ నుండి మూడు పర్యాయాలు శాసనసభ్యులుగా గెలుపొంది, ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సేవ చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, పోలెపాక యాదయ్య, బొడిగ సుదర్శన్ గౌడ్, ఏఐటీయూసీ నాయకులు కందుకూరి సంజీవ, ఎడవల్లి వేమన్న, వింజమూరి సాయిలు, మేడదూల నరేష్, శ్యామల నరేందర్, పూడూరి నరేష్, కాటం నరసింహ, బొంగు అనిత తదితరులు పాల్గొన్నారు.

మునగాకుతో ఆరోగ్యానికి ఎన్ని ప్రయోజనాలో తెలుసా



మనకు ప్రకృతి ఎన్నో విధాలుగా సాయపడుతుంది. ప్రకృతిసిద్ధంగా లభించే చెట్ల ద్వారా మనకు ఆహారంతోపాటు ఔషధాలు కూడా మెండుగా లభిస్తాయి. ఆహారంగా ఉపయోగపడే కొన్ని మొక్కలు మన ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అలాంటి వాటిలో మునగ కూడా ఒకటి. మునగాకు (వీశీతీఅఅస్ఱు శ్రీమ్ఱజవం) ను ఆకు కూరగానో, పప్పులో కలెగూరగానో లేదంటే పచ్చడిగానో చేసుకుని తినడంవల్ల ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. మరి మునగాకుతో కలిగే ఆ ప్రయోజనాలు ఏంటో చూద్దాం.. ప్రయోజనాలు.. వర్షాకాలంలో మునగాకును ఎక్కువగా వాడటంవల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. అంతేగాక ఈ కాలంలో తరచుగా వచ్చే జలుబు, దగ్గులాంటి ఇబ్బందుల నుంచి కూడా బయటపడవచ్చు. పాలకూరతో పోలిస్తే మునగాకులో మూడు రెట్లు ఎక్కువగా ఐరన్ ఉంటుంది. అరటిపండు కంటే ఏడు రెట్లు ఎక్కువగా మెగ్నీషియం లభిస్తుంది. పాలల్లో కంటే రెండు రెట్లు ఎక్కువగా ప్రొటీన్లు ఉంటాయి. ఈ ఇనుము, మెగ్నీషియం మనల్ని త్వరగా అలసటకు గురికాకుండా చేస్తాయి. మునగాకులో ఎక్కువగా ఉండే పీచువల్ల కాస్త తినగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల మునగాకును నిత్యం వాడటంవల్ల అతిగా తినడం అనే సమస్య తీరుతుంది. మునగాకులో ఉండే క్లోరోజనిక్ ఆమ్లం కొవ్వును కరిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో సాయపడుతుంది.మునగలోని విటమిన్-ఎ చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. మునగాకులోని అమైనో ఆమ్లాలు ప్రొటీన్ ఉత్పత్తికి తోడ్పతాయి. ఈ ప్రొటీన్ జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. కడుపులోని పుండ్లు, ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది.

బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌తో బ్లడ్ క్యాన్సర్‌కు చెక్



రక్త క్యాన్సర్ నిర్ధారణ అయినంత మాత్రాన జీవితంపై ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదు. వైద్యరంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక చికిత్సలు ఎంతోమంది రోగులకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయి. సరైన వైద్య సలహా, సమయానికి చికిత్స, కుటుంబ సభ్యుల సహకారం, క్రమబద్ధమైన పర్యవేక్షణతో ఆరోగ్యకరమైన జీవితాన్ని తిరిగి ప్రారంభించవచ్చు. రక్త క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి. వైద్యరంగంలో వస్తున్న మార్పులతో బ్లడ్ క్యాన్సర్‌కు సరైన చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయి. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (ఎముక మజ్జ మార్పిడి) లేదా స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (మూలకణ మార్పిడి).. బ్లడ్ క్యాన్సర్ రోగులకు కొత్త ఆశలు కల్పిస్తున్నది. లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా క్యాన్సర్ బాధితులకు సాధారణ జీవితాన్ని అందిస్తున్నది. రక్త క్యాన్సర్లతోపాటు అప్లాస్టిక్ అనీమియా, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వంటి జన్యుపరమైన, రోగ నిరోధక, మెటబాలిక్ వ్యాధులు తీవ్రంగా ఉన్నవారికి కూడా బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స ఉపయోగపడుతున్నది.

భోజనం బాగాలేదని రోడ్డెక్కిన ఓయూ విద్యార్థినులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీలో తమకు అందిస్తున్న భోజనం నాణ్యంగా లేదంటూ విద్యార్థినులు రోడ్డెక్కారు. లేడీస్ హాస్టల్‌లో భోజనం సరిగా లేదంటూ ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ భోజనానికి సంబంధించిన గిన్నెలు, అన్నం, కూరలతో సహా రోడ్డుపై బైఠాయించారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ..అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వచ్చి తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చే వరకు అక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్పినా కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు.

ఎముకలకు పొగ దెబ్బ



సాధారణంగా ఎముకలు చిన్నప్పటి నుంచి బలపడతాయి. 20 నుంచి 30 ఏండ్ల మధ్య వయసులో ఎముకలు అత్యంత దృఢంగా మారుతాయి. 30 ఏండ్లు దాటినప్పటి నుంచి ఎముకల సాంద్రత పెరుగుదల ఆగిపోతుంది. అలాగే తగ్గుదల మొదలవుతుంది. ఇలా కాలక్రమేణా బలహీనపడే ఎముకలు కొందరిలో తొందరగా బలహీనపడతాయి. క్యాల్షియం ఉన్న ఆహారం తగినంత తినకపోతే సాధారణంగా ఎముకల సాంద్రత తగ్గుతుంది. ఆస్టియోపొరోసిస్ అనే వ్యాధి వస్తుంది. కొందరు క్యాల్షియం ఉన్న ఆహారం తిన్నా జీర్ణకోశ వ్యాధులు, ఎక్కువ కాలం బెడ్ రెస్ట్, మెనోపాజ్, విటమిన్ డి లోపం వల్ల కూడా క్యాల్షియం లోపాన్ని ఎదుర్కొంటారు. శరీరంలో క్యాల్షియం లోపానికి పరోక్షంగా కారణమయ్యే వ్యాధులు వచ్చినప్పుడు వైద్యులు ముందే హెచ్చరిస్తారు. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. ఇలాంటి సమస్యలు లేకున్నా కొంతమందిలో ఎముకలు తొందరగా బలహీనపడిపోతుంటాయి. రోజూ క్యాల్షియం ఉండే ఆహార పదార్థాలు బాగానే తింటున్నాం కాబట్టి, ఎముకలు బలంగా ఉన్నాయనుకుంటే పొరపాటే! పొగ తాగడం వల్ల శరీరం.. క్యాల్షియం సంగ్రహణ శక్తిని కోల్పోతుంది. ధూమపానం వల్ల ఊపిరితిత్తులు పాడవుతాయి. గుండె ఆరోగ్యం క్షీణిస్తుంది. కిడ్నీల పనితీరుపైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇవే జనానికి ఎక్కువగా తెలుసు. కానీ, పొగతాగే అలవాటు ఎముకలపైనా ప్రభావం చూపిస్తుంది. ఎన్ని ఆహార నియమాలు పాటించినప్పటికీ, ఎముకల్ని కాపాడుకోవాలంటే.. పొగ మానేయాల్సిందేనని చెబుతున్నారు వైద్యులు.

దేశంలోని నగరాల్లో భారీగా పెరుగుతున్న వాయు కాలుష్యంఊపిరితిత్తులకు హాని కలిగిస్తాయంటున్న వైద్యులు



దీపావళి పండుగ సందర్భంగా కాల్చిన బాణసంచా ప్రభావంతో దేశ రాజధాని న్యూఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో గాలిలోని విషపూరిత కాలుష్య కణాల స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన రోజువారీ పరిమితి కంటే 58 రెట్లకు పైగా నమోదైంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటైన ఢిల్లీలో దీపావళి పండుగను లక్షలాది మంది బాణసంచా కాల్చి జరుపుకుంటారు. ఇప్పటికే వాహనాల పొగ, పంట వ్యర్థాలను తగలబెట్టడం, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా శీతాకాలంలో నగరాన్ని పొగమంచు కమ్ముకుంటోంది. ఈ పరిస్థితిని బాణసంచా కాల్చడం మరింత తీవ్రతరం చేస్తోంది.

ఊపిరితిత్తులకు హాని కలిగిస్తాయి..

ఈ నెలలో సుప్రీంకోర్టు తక్కువ కాలుష్యాన్ని విడుదల చేసేలా రూపొందించిన పచ్చ బాణసంచాను పరిమితంగా వినియోగించేందుకు అనుమతించింది. అయినప్పటికీ, ఆంక్షలను చాలాచోట్ల పాటించకపోవడంతో దీపావళి రాత్రి నగరమంతా బాణసంచా పేలుళ్లతో మారుమోగింది. బాణసంచా కాల్చడం గరిష్ఠ స్థాయికి చేరుకున్న తర్వాత మండీర్ మార్గ్ ప్రాంతంలో గాలిలోని పీఎం 2.5 సూక్ష్మ కాలుష్య కణాల స్థాయి ప్రతి ఘనపు మీటరుకు 879 మైక్రోగ్రాములకు చేరింది. నగర ప్రభుత్వ పర్యవేక్షణ కేంద్రం నుంచి సేకరించిన వివరాలను ఐక్యూఎయిర్ సంస్థ వెల్లడించింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన రోజువారీ గరిష్ఠ పరిమితి కంటే దాదాపు 59 రెట్లు ఎక్కువ. ఈ సూక్ష్మ కణాలు ఊపిరితిత్తుల్లోకి చేరి ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తాయి.

కాలుష్యం ఏర్పడేందుకు కారణాలు ఇవే..

కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ అధికారులు ఇటీవలి వారాల్లో వాహనాల రాకపోకలు, నిర్మాణ పనులపై పలు ఆంక్షలు అమలు చేస్తున్నారు. మూడు కోట్ల మందికి పైగా నివసించే ఈ నగరంలో శీతాకాలపు వాయు కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడే పొగ 23 శాతం కారణమవుతోంది. పంట వ్యర్థాలను తగలబెట్టడం సహా జీవ పదార్థాలను కాల్చడం వల్ల 20 శాతం కాలుష్యం ఏర్పడుతోంది. బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలతో సహా పరిశ్రమల వాటా సుమారు తొమ్మిది శాతంగా ఉంది. అయితే, వాహనాలు, పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాలు, జీవ పదార్థాలను కాల్చడం వల్ల విడుదలయ్యే వాయువులు వాతావరణంలో రసాయనిక చర్యలకు లోనై ఏర్పడే ద్వితీయ సూక్ష్మ కణాలే అత్యధికంగా 27 శాతం కాలుష్యానికి కారణమవుతున్నాయి.

38 లక్షల మరణాలకు కారణం..

వాయు కాలుష్యం ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో 2024లో ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ పరిశోధనా పత్రికలో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. 2009 నుంచి 2019 మధ్య కాలంలో భారత్‌లో సంభవించిన 38 లక్షల మరణాలకు వాయు కాలుష్యం సంబంధం ఉన్నట్లు ఈ అధ్యయనం అంచనా వేసింది. దీపావళి సమయంలో బాణసంచా వినియోగం ఇప్పటికే తీవ్రంగా ఉన్న కాలుష్యాన్ని మరింత పెంచుతుండడంతో, ప్రజారోగ్య పరిరక్షణకు కాలుష్య నియంత్రణ చర్యలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

పండుగల అనంతరం బరువు పెరుగుదలతో ఆందోళన వద్దు ఇలా చేయండి చాలు

పండుగల సమయంలో కొన్ని రోజుల పాటు మిఠాయిలు, నూనె పదార్థాలు, ఎక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల బరువు పెరిగినట్లు కనిపిస్తారు. అయితే రెండు కిలోల బరువు పెరిగిందంటే అంతా శరీరంలో కొవ్వు పెరిగినట్లుగా భావించకూడదు. పండుగ రోజుల్లో ఎక్కువగా తినడం, ఉప్పు ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవడం, రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయడం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో శరీరంలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటుంది. అలాగే కాలేయం, కండరాల్లో గ్లైకోజన్ నిల్వలు పెరగడం వల్ల కూడా తాత్కాలికంగా బరువు పెరుగుతుంది. అధిక కేలరీల ఆహారం ఎక్కువ వారాల పాటు కొనసాగితేనే కొవ్వు పేరుకుపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పండుగ తర్వాత ఆహారం మానేయడం, పండ్ల రసాలనే తీసుకోవడం, అన్నం వంటి కార్బోహైడ్రేట్లను పూర్తిగా తగ్గించడం లేదా కఠినమైన ఆహార నియమాలు పాటించడం సరైన పద్ధతి కాదు. వీటివల్ల మొదట్లో బరువు తగ్గినట్లు కనిపించినా కండరాల బలం, శక్తి, పోషకాలు తగ్గే ప్రమాదం ఉంటుంది.

పెరిగిన బరువంతా కొవ్వేనా.

మన శరీర బరువు కొవ్వు, కండరాలు, నీరు, గ్లైకోజన్ నిల్వలతో కలిసి ఉంటుంది. కార్బోహైడ్రేట్లను ఎక్కువగా తీసుకున్నప్పుడు కాలేయం, కండరాల్లో గ్లైకోజన్ నిల్వలు పెరుగుతాయి. ప్రతి గ్రాము గ్లైకోజన్‌తోపాటు కొంత నీరు కూడా నిల్వ ఉంటుంది. ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు కూడా శరీరంలో ద్రవాలు పేరుకుపోతాయి. సాధారణ ఆహారపు అలవాట్లు, వ్యాయామం తిరిగి ప్రారంభించిన తర్వాత ఈ మార్పులు క్రమంగా తగ్గుతాయి. అయితే శరీరం ఖర్చు చేసే శక్తి కంటే ఎక్కువ కేలరీలు నిరంతరం తీసుకుంటే అదనపు శక్తి కొవ్వుగా నిల్వ అవుతుంది. బరువుతోపాటు నడుము చుట్టుకొలతను కూడా గమనించాలి. ముఖ్యంగా పొట్టలోని అంతర్గత కొవ్వు ఇన్సులిన్ నిరోధకత, ఇతర జీవక్రియ సంబంధిత సమస్యలతో ముడిపడి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు, కొవ్వు పదార్థాల స్థాయిలు, కాలేయ పనితీరు పరీక్షలు కూడా ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడానికి ఉపయోగపడతాయి.

ప్రోటీన్లు సరిగ్గా లభించకపోతే

అతి తక్కువ కేలరీలు తీసుకునే ఆహార నియమాలు బరువు తగ్గడానికి సరైన మార్గం కావు. ప్రోటీన్ తగినంతగా అందకపోతే కొవ్వుతోపాటు కండరాలు కూడా తగ్గుతాయి. కండరాలు శరీరక బలాన్ని అందించడమే కాకుండా రక్తంలో చక్కెర నియంత్రణలోనూ ముఖ్యపాత్ర పోషిస్తాయి. పదేపదే కఠినమైన ఆహార నియమాలు పాటించడం వల్ల దీర్ఘకాలంలో బరువును నియంత్రించడం కష్టమవుతుంది. బరువు తగ్గాలంటే శరీరానికి అవసరమైన దానికంటే కొద్దిగా తక్కువ కేలరీలు తీసుకుంటూ, తగినంత ప్రోటీన్‌తోపాటు కార్బోహైడ్రేట్లు, కొవ్వులు సమతుల్యంగా ఉండే ఆహారం తీసుకోవాలి. డీటాక్స్ టీలు, జ్యూస్‌లతో చేసే శుభ్రపరిచే పద్ధతులు, కాలేయాన్ని శుద్ధి చేస్తాయని చెప్పే మందులు కూడా బరువు తగ్గించే పరిష్కారాలు కావు. కాలేయం, మూత్రపిండాలు శరీరంలోని వ్యర్థాలను తొలగించే పనిని నిరంతరం చేస్తుంటాయి. జ్యూస్‌లతో మాత్రమే ఉండే ఆహారంలో ప్రోటీన్, పీచు పదార్థాలు తక్కువగా ఉంటాయి. విరేచనాలు లేదా మూత్ర విసర్జన పెంచే పదార్థాలు తాత్కాలికంగా శరీరంలోని నీటిని తగ్గిస్తాయి తప్ప కొవ్వును తగ్గించవు. కొన్ని మూలికా పదార్థాలు వాడే మందులతో ప్రతికూల ప్రభావాలు చూపిస్తాయి. ముఖ్యంగా ఫ్యాటీ లివర్, మధుమేహం, అధిక రక్తపోటు లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా ఇలాంటి ఉత్పత్తులు వాడకూడదు.

పండుగల తరువాత ఏం చేయాలి

పండుగ తర్వాత ముందుగా సాధారణ భోజనపు అలవాట్లకు తిరిగి రావాలి. ప్రతి ప్రధాన భోజనంలో ప్రోటీన్ అందించే ఆహారంతోపాటు కూరగాయలు, పప్పులు, సంపూర్ణ ధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. పండ్లు తీసుకోవడం వల్ల పీచు పదార్థాలు అందడమే కాకుండా తీపి పదార్థాలపై కోరికను నియంత్రించడంలో సహాయపడుతాయి. నడక, ఈత, సైక్లింగ్ వంటి వ్యాయామాలు గుండె ఆరోగ్యానికి, ఇన్సులిన్ పనితీరుకు మేలు చేస్తాయి. బరువు తగ్గే సమయంలో కండరాలు తగ్గకుండా ఉండేందుకు బలవర్ధక వ్యాయామాలు కూడా అవసరం. నిద్ర సరిగా లేకపోవడం ఆకలి, ఆహారపు అలవాట్లపై ప్రభావం చూపుతుంది కాబట్టి తగినంత నిద్ర కూడా ముఖ్యం. బరువు నిరంతరం పెరుగుతుంటే శరీర ద్రవ్యరాశి సూచీ, నడుము కొలత, రక్తంలో చక్కెర, కొవ్వు పదార్థాలు, కాలేయ పనితీరు పరీక్షలు చేయించుకోవాలి. జీవనశైలి మార్పులు, వ్యాయామం, వైద్య చికిత్సతోనూ ఆశించిన ఫలితం రాని స్థూలకాయం ఉన్నవారికి నిపుణుల పరిశీలన తర్వాత బేరియాట్రిక్ శస్త్రచికిత్సను పరిశీలించవచ్చు.



శస్త్ర చికిత్సలతో ప్రయోజనం ఉంటుందా..

ఈ శస్త్రచికిత్స వల్ల మధుమేహం నియంత్రణలోనూ ప్రయోజనం ఉంటుందని అధ్యయనాలు వెల్లడించాయి. ఐదేళ్ల స్టాంపీడ్ అధ్యయనంలో గ్యాస్ట్రిక్ బైపాస్ చేయించుకున్న వారిలో 29 శాతం మంది, స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ చేయించుకున్న వారిలో 23 శాతం మంది హెచ్‌బీఏ1సీ స్థాయిని ఆరు శాతం లేదా అంతకంటే తక్కువకు తీసుకురాగలిగారు. వైద్య చికిత్స పొందిన వారిలో ఈ సంఖ్య ఐదు శాతంగా ఉంది. అలాగే 12 ఏళ్ల పాటు కొనసాగిన ఆర్బ్-టీ2డీ అధ్యయనంలో శస్త్రచికిత్స చేయించుకున్నవారు సగటున 19.3 శాతం బరువు తగ్గగా, మందులు, జీవనశైలి మార్పులు పాటించినవారిలో ఈ తగ్గుదల 10.8 శాతంగా నమోదైంది. అయితే శస్త్రచికిత్స అవసరమా లేదా అనేది వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, స్థూలకాయం తీవ్రత, ఇతర అనారోగ్య సమస్యలు, గత చికిత్సల ఫలితాలను పరిశీలించిన తర్వాతే వైద్యులు నిర్ణయిస్తారు. పండుగ తర్వాత కొన్ని రోజుల బరువు పెరుగుదలను చూసి ఆందోళన చెందకుండా సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం, ఆరోగ్యకరమైన దినచర్యను తిరిగి ప్రారంభించడం ఉత్తమమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

పథ్యం చేయాలా వద్దా ఆయుర్వేదంలో ఆహార నియమాల అసలు రహస్యం ఇదే



అమర కోశం ప్రకారం.. పథ్యం అంటే హితకరమైనది. మనకు అనుకూలమైనది. అపథ్యం అంటే అహితకరమైనది. అనుకూలమైన పథ్యాలు, అనుకూలం కాని పథ్యాలు అన్నీ వైద్యశాస్త్రంలో ఉంటాయి. మధుమేహ రోగులకు పిండి పదార్థాలు, మధుర పదార్థాలు, తియ్యని పానీయాలు అపథ్యం అని ఆయుర్వేదం చెప్పింది. తీయని పదార్థాలు ఎకువగా తీసుకోవడం అనేది మధుమేహానికి కారణమని కూడా చెప్పారు. ఇప్పటి వైద్యం ఇంతకుమించి ఏం చెప్పలేదు.లోలాంబరాజు రచించిన వైద్య జీవనం అనే గ్రంథంలో పథ్యం గురించి ఎంతో ఆధునికంగా వివరించారు. హెల్త్ కేర్ రంగంలో ఆహారం, జీవనశైలి, ప్రాముఖ్యత గురించి చాలా అద్భుతంగా చెప్పారు. దినచర్యలో భాగంగా శరీర ధర్మాన్ని బట్టి, రుతువులను అనుసరించి గట్ హెల్త్‌ని ఇబ్బంది పెట్టకుండా ఆహారాన్ని తీసుకుంటే ఔషధాల అవసరం ఏముంటుంది? సమతుల ఆహారం తీసుకోకపోతే ఎన్ని మందులు వాడినా ఎలాంటి ప్రయోజనం ఉండదు.నాటు వైద్యాలు, ట్రైబల్ వైద్యాలు, గచ్చకు-పిచ్చాకు వైద్యాలతో ప్రాక్టీస్ చేసేవారు నిరంతరం చెప్పేదొకటే. గొడ్డుకారంతో అన్నం తినండి, దుంపలు తినకండి, వంకాయ తినకండి, పచ్చళ్లు తినకండి, ఒట్టి చేపలు తినకండి, గుమ్మడికాయ తినకండి.. అంటూ పథ్యం పేరుతో తినకూడని అంశాలు చెబుతూ ఉంటారు. చేయాల్సిన పనుల కింద చేయకూడని పనుల గురించి చెబుతారు. కొంతమంది ఆయుర్వేద వైద్యులు కూడా ఇలాగే చెప్పడం మొదలుపెట్టారు. దీనికి తోడు ఇంగ్లిష్ వైద్యుల దుష్ప్రచారం, ప్రతిఘటించే వాళ్లు లేకపోవడం ఇతరత్రా కారణాలవల్ల ఆయుర్వేదంలో పథ్యం ఓ బ్రహ్మ పదార్థంలా మారింది. పథ్యం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. దీన్ని లోతుగా అర్థం చేసుకోవడం అవసరం. 'అడిగేవాడికి చెప్పేవాడు లోకువ' అన్నట్లు.. అపోహలు పెట్టుకునే వారు కూడా తమ చుట్టూ ఆయుర్వేదం వాడిన వాళ్ల అనుభవాలు సేకరించుకోవాల్సిన అవసరం ఉంది. ఏమీ తెలుసుకోకుండా కేవలం ఒక వైద్యశాస్త్రం చెప్పిందే వేదమని నమ్మడం వల్ల, నిజమైన ఆయుర్వేద అభివృద్ధిని దూరం చేసుకోవడం వల్ల ప్రజలే నష్టపోతారు. ఆయుర్వేద చికిత్సతో కీళ్ల వాతం, కీళ్లు గట్టిపడి చేతులు ఎత్తలేక పోవడం, ఆర్థరైటిస్, లివర్ జబ్బులు, వెన్ను నొప్పి సమస్యలు, క్లోమ గ్రంథి పైన వాపు తదితర రుగ్మతలు చాలా బాగా తగ్గుతున్నాయి. అనేక కారణాల వల్ల దెబ్బతిన్న జీవశక్తి.. ఆయుర్వేదంతో కరెక్ట్ అవుతుంది. గట్ హెల్త్ గణనీయంగా అభివృద్ధి చెందుతుంది. లివర్ పనితీరు మెరుగవుతుంది. మందులు అవసరం లేకుండా గ్యాస్, ఎసిడిటీ తగ్గి ప్రశాంతమైన నిద్ర పడుతుంది. శరీరం తేలికపడి ఆరోగ్యకరమైన నడక మొదలవుతుంది. చాలా ఆయుర్వేద ఔషధాలలో గుగ్గులు ఉండటం వల్ల రక్తనాళాలలో పేరుకుపోయిన కొవ్వు తగ్గుతుంది. ఎలాంటి ఎక్స్‌ట్రా డైటింగ్ అవసరం లేకుండానే శరీర బరువు తగ్గుతారు. పూర్వం వైద్యులు చికిత్సలో భాగంగా పథ్యం కూరలు తీసుకోమని చెప్పేవారు. నీరు నిండిన కాయగూరలు సొరకాయ, బీరకాయ, పొట్లకాయ, దొండ, బెండ, తెల్ల గుమ్మడి, గోరుచికుడు, లేత బీన్స్, మునకాడలు, కాకర లాంటివి తినాలని సూచించేవారు. పులుపు, కారం, మసాలాలు, తగ్గించమని చెప్పేవారు. పెరుగు బదులు మజ్జిగ, పప్పు కట్టు, ఉడకబెట్టిన గుడ్లు, మాంసాహారంలో చేపలు తినాలనేవారు. ఇలాంటి పథ్యం అల్లోపతి వైద్యులు కూడా చెబుతూ ఉంటారు. ఎలా వచ్చి చేరిందో కానీ, ఒక భావజాలం ఆయుర్వేదాన్ని అల్లిబిల్లిగా అల్లుకుంది. అవి తొలగిస్తే నిజమైన ఆయుర్వేదం వెలుగులోకి వస్తుంది. కుప్రచారం కుపరీక్షితం లాగా ఏది పరీక్షించకుండా, ఏదీ చూడకుండా, ఏది సరిగ్గా అర్థం చేసుకోకుండా, గుడ్డిగా నమ్మకూడదని పంచతంత్రం చెబుతుంది. రోగం ముదిరిన తర్వాత ఆయుర్వేదాన్ని ఎంచుకునే కంటే.. ముందస్తుగానే ఈ వైద్యాన్ని ఆశ్రయిస్తే మనకు ఎంతో మేలు జరుగుతుంది.

ప్లాస్టిక్ కరెన్సీ వచ్చాక పేపర్ నోట్లు బ్యాన్..! కేంద్రం నుంచి బిగ్ అనౌన్స్‌మెంట్ అసలు క్లారిటీ వచ్చేసింది..



ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై కేంద్రం నుంచి మరో అప్డేట్ వచ్చింది. ఆర్బీఐ త్వరలో ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టేందుకు రెడీ అవుతోంది. అయితే ఇవి అందుబాటులోకి వచ్చాక పేపర్ కరెన్సీ ఏమవుతుందనే ప్రశ్నలు చాలామందిలో వస్తున్నాయి. వీటిని రద్దు చేస్తారా అనే వార్తలు వస్తున్నాయి. ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను త్వరలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. గతకొద్ది రోజుల క్రితం ఆర్బీఐ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో పాలిమర్‌తో కూడిన ప్లాస్టిక్ నోట్లను త్వరలో ప్రవేశపెట్టేందుకు ఆర్బీఐ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పాలిమర్ షీట్ల కోసం అంతర్జాతీయ కంపెనీల నుంచి ఆర్బీఐ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్లు ఖరారు అయిన తర్వాత ప్లాస్టిక్ నోట్ల ప్రింటింగ్ మొదలుకానుందని తెలుస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం ఆర్బీఐ ఈ ప్రాజెక్టును చేపట్టగా.. ఏటీఎంలలో సాంకేతిక కారణాల వల్ల నిలిపివేసింది. ఇప్పుడు మరోసారి పైలట్ ప్రాజెక్టుగా ప్లాస్టిక్ నోట్లను తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ఏడాది ఆఖరు లేదా వచ్చే ఏడాదిలో వీటిని మనం చూడవచ్చు.

వచ్చే ఏడాది నుంచి చలామణిలోకి..

అయితే వచ్చే ఏడాది ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ఆర్బీఐ చలామణిలోకి తీసుకురానుంది తెలుస్తోంది. ఈ క్రమంలో ఓ వార్త ఆందోళన కల్గిస్తోంది. ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి తీసుకొచ్చాక ప్రస్తుతం అమల్లో ఉన్న పేపర్ కరెన్సీని ఆర్బీఐ నిలిపివేస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ క్రమంలో ఆ వార్తలపై కేంద్రం స్పష్టతిచ్చింది . ప్రస్తుతానికి పేపర్ కరెన్సీ నోట్లను నిలిపివేసే ప్రతిపాదన తమ వద్ద లేదని కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆర్థికశాఖ సహాయమంత్రి దీని గురించి ప్రకటన చేశారు. ప్లాస్టిక్ కరెన్సీ అందుబాటులోకి వచ్చాక కూడా కాగితపు కరెన్సీ కూడా చలామణిలో కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు తమ వద్ద ఉన్న పేపర్ కరెన్సీని మార్చుకోవాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ఎప్పటిలాగే వాటిని ఉపయోగించకోవచ్చని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసే నిర్ణయం తీసుకోబోమని పేర్కొన్నారు.

పైలట్ ప్రాజెక్టుగా..

ప్రస్తుతానికి పైలట్ ప్రాజెక్ట్ కింద రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లను ఆర్బీఐ తొలుత తీసుకురానుంది. క్షేత్రస్థాయిలో ప్రయోగాలు చేపట్టిన అనంతరం మరిన్ని నోట్లను తీసుకొస్తారు. పైలట్ ప్రాజెక్ట్ కోసం పరిమితి స్థాయిలోనే మొదట్లో ఈ నోట్లను తయారుచేయనున్నారు. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితులు, వినియోగ పరిస్థితుల్లో వాటి తీరు గురించి పరీక్షిస్తారు. ఈ లక్ష్యంతోనే తొలుత ప్రయోగాత్మకంగా రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లను ఆర్బీఐ తీసుకురానుంది. ఒకసారి ప్రయోగం విజయవంతం అయిన తర్వాత భారీ స్థాయిలో వీటిని చలామణిలోకి తీసుకురానున్నట్లు కేంద్రం పేర్కింది. అయితే జులై 17వ తేదీన ఆర్బీఐకు చెందిన నోట్ ముద్రణ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ముద్రించేందుకు 3.4 కోట్ల పాలిమర్ షీట్ల కోసం గ్లోబల్ టెండర్ ఆహ్వానించింది. ఈ టెండర్‌లో తక్షణ అవసరం అని పేర్కొంది. పరీక్షలు విజయంతం అయిన తర్వాత వివిధ డినామినేషన్ల కోసం పెద్ద పరిమాణంలో సబ్‌స్ట్రేట్ సేకరిస్తారు.

అమ్మబాబోయ్ ఒక్క నెలలోనే అన్ని లక్షల కార్లు అమ్మేసిందా? మారుతి సుజుకి కొత్త రికార్డ్



జూలై 2026లో మారుతి సుజుకి చరిత్ర సృష్టించింది. దేశీయంగా పెద్ద సంఖ్యలో కార్లను విక్రయించి కొత్త రికార్డు నెలకొల్పింది. మొత్తం 2.41 లక్షల వాహనాలను పంపిణీ చేయగా, బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్, ఇ-విటారా వంటి కొత్త మోడళ్లకు భారీ బుకింగ్‌లు నమోదవుతున్నాయి. సంస్థ వద్ద ప్రస్తుతం 1.60 లక్షల పెండింగ్ బుకింగ్‌లు ఉన్నాయి. అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి జూలై 2026లో రికార్డు స్థాయి అమ్మకాలను నమోదు చేసింది. ఒకే నెలలో దేశీయ మార్కెట్లో 2 లక్షలకు పైగా వాహనాలను విక్రయించి, భారతీయ ఆటోమొబైల్ రంగంలో కొత్త రికార్డును సృష్టించింది. మొత్తం 2,41,241 వాహనాలను పంపిణీ చేసిన సంస్థలో 30,056 యూనిట్లు ఎగుమతులకు వెళ్లగా, దేశీయంగా 2,00,123 వాహనాలు అమ్ముడయ్యాయి. దేశీయ అమ్మకాలలో ప్యాసింజర్ వాహనాల (ఎం) వాటా 1,93,203 యూనిట్లు కాగా, కమర్షియల్ వాహనాల (జఎ) అమ్మకాలు 3,920 యూనిట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది జూలైలో మొత్తం 1,80,526 వాహనాలు విక్రయించిన మారుతి సుజుకి, ఈసారి ఆ సంఖ్యను గణనీయంగా పెంచుకుంది. అలాగే జూలై 2025లో దేశీయ అమ్మకాలు 1,40,570 యూనిట్లుగా ఉండగా, ఈ ఏడాది 2 లక్షల మార్క్‌ను దాటడం విశేషం. మారుతి సుజుకి మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బానర్జీ మాట్లాడుతూ, ప్రస్తుతం సంస్థ వద్ద సుమారు 1.60 లక్షల పెండింగ్ బుకింగ్‌లు ఉన్నాయని తెలిపారు. ఇటీవల మార్కెట్లోకి వచ్చిన కొత్త బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్‌కు ప్రతిరోజూ దాదాపు 2,000 బుకింగ్‌లు వస్తుండగా, ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ అయిన ఇ-విటారాకు ప్రతి నెలా సుమారు 4,000 బుకింగ్‌లు నమోదవుతున్నాయని వెల్లడించారు. పెరుగుతున్న డిమాండ్, కొత్త మోడళ్లకు లభిస్తున్న ఆదరణతో రానున్న నెలల్లో కూడా అమ్మకాలు మరింత బలంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

హోమ్ లోన్ తీసుకున్న వ్యక్తి చనిపోతే.. మిగితా ఈఎంఐ ఎవరు కట్టాలి? బ్యాంకు రూల్స్ ఏం చెప్తున్నాయి



ప్రస్తుతం సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి చాలా మంది హోమ్ లోన్ తీసుకుంటున్నారు. అయితే దశాబ్దాల పాటు సాగే ఈ ఈఎమ్ఐల ప్రయాణంలో రుణం తీరకముందే లోన్ తీసుకున్న వ్యక్తి మరణిస్తే.. ఆ లోన్ పరిస్థితి ఏంటి? బ్యాంకులు ఆ ఇల్లు జప్తు చేస్తాయా? హోమ్ లోన్ తీసుకునే ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు ఇవే.. సొంతిల్లు అనేది ఎంతోమంది కల. ఆ కలను సాకారం చేసుకోవడానికి చాలామంది బ్యాంకుల నుంచి హోమ్ లోన్ తీసుకుంటారు. 15 నుంచి 30 ఏళ్ల సుదీర్ఘ కాలపరిమితితో ఈ రుణాలు ఉంటాయి. అయి, లోన్ వ్యవధి తీరకుండానే రుణం తీసుకున్న వ్యక్తి అనుకోకుండా మరణిస్తే.. మిగిలిన రుణాన్ని ఎవరు చెల్లించాలి? బ్యాంకులు ఆ ఇంటిని వేలం వేస్తాయా? లేక బకాయిలు రద్దవుతాయా? ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంకింగ్ నిబంధనలు ఏం చెబుతున్నాయో అందరూ తెలుసుకోవడం ముఖ్యం.

లోన్ ఇన్సూరెన్స్ ఉంటే..

హోమ్ లోన్ ఇచ్చే సమయంలోనే బ్యాంకులు హోమ్ లోన్ ఇన్సూరెన్స్ లేదా టర్మ్ ప్లాన్ తీసుకునే వెసులుబాటు కల్పిస్తాయి. రుణం తీసుకున్న వ్యక్తి మరణిస్తే, బీమా కంపెనీయే మిగిలిన లోన్ మొత్తాన్ని బ్యాంకుకు చెల్లిస్తుంది. దీనివల్ల మృతుడి కుటుంబంపై ఎలాంటి ఆర్థిక భారం పడదు. లోన్ క్లియర్ అయిన తర్వాత ఆస్తి హక్కులు వారసులకు బదిలీ అవుతాయి.

జాయింట్ హోమ్ లోన్ తీసుకుంటే..

భార్యాభర్తలు లేదా కుటుంబ సభ్యులు కలిపి జాయింట్ లోన్ తీసుకున్న సందర్భంలో దరఖాస్తుదారు మరణిస్తే, లోన్ చెల్లించే బాధ్యత కో అప్లికెంట్‌కు ఉంటుంది. మిగిలిన ఈఎమ్ఐలను రెండవ వ్యక్తి నిరంతరం చెల్లించాల్సి ఉంటుంది.

ఇన్సూరెన్స్ లేకపోతే.. చట్టబద్ధ వారసుల బాధ్యత

ఒకవేళ హోమ్ లోన్ ఇన్సూరెన్స్ లేకపోతే, సదరు వ్యక్తి చట్టబద్ధ వారసులు లేదా కుటుంబ సభ్యుల వద్దకు బ్యాంక్ అధికారులు వెళ్తారు. వారసులు మిగిలిన లోన్ మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధపడితే, వారి పేరిట లోన్ రీ-షెడ్యూల్ లేదా ట్రాన్స్‌ఫర్ చేసి ఈఎమ్ఐలు కట్టించుకుంటారు. వారసులు లోన్ చెల్లించలేమని చెబితే, లేదా చెల్లించడంలో విఫలమైతే బ్యాంకు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది.

ఇల్లు వేలం వేసే హక్కు బ్యాంకుకు ఉందా?

వారసులు ఈఎమ్ఐలు చెల్లించకపోతే.. బ్యాంక్ సదరు ఆస్తిని సీజ్ చేసి సర్ఫేసీ యాక్ట్ కింద బహిరంగ వేలం వేస్తుంది. వేలం ద్వారా వచ్చిన డబ్బుతో బ్యాంక్ తన బకాయిలను జమ చేసుకుంటుంది. లోన్ బకాయిలు పోనూ ఇంకా ఏమైనా డబ్బు మిగిలితే, ఆ మొత్తాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగిస్తుంది. హోమ్ లోన్ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా హోమ్ లోన్ ప్రొటెక్షన్ ఇన్సూరెన్స్ తీసుకోవడం అత్యంత సురక్షితమైన మార్గం.

వారెవ్వా ఒక్క కాల్ చేస్తే రెండు గంటల్లోనే ఇంటికి గ్యాస్ సిలిండర్ నెంబర్ ఇదే











కొత్త గ్యాస్ సిలిండర్ కోసం చూస్తున్నారా.. అయితే కొత్త కనెక్షన్ కోసం గంటల కొద్ది ఏజెన్సీ కార్యాలయాల వద్ద వెయిట్ చేయాల్సిన పని లేదు. సులువుగా ఒక కాల్ ద్వారా కనెక్షన్ పొందవచ్చు. మీ ఇంటికే నేరుగా సిలిండర్ వచ్చేస్తుంది. ఈ ప్రాసెస్ ఎలా అంటే..

ఇప్పటివరకు గ్యాస్ సిలిండర్ కావాలంటే చాలా ప్రాసెస్ ఉండేది. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు లాంటివి సమర్పించాల్సి వచ్చేది. సెక్యూరిటీ డిపాజిట్, గ్యాస్ కనెక్షన్, ఇతర ఫీజులు చెల్లిస్తే మీ పేరుపై గ్యాస్ కనెక్షన్ అందిస్తారు. ఆ తర్వాత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుంటే ఇంటికి డెలివరీ అవుతుంది. ఈ ప్రాసెస్ కంప్లీట్ అవ్వడానికి చాలా సమయం పడుతుంది.

1 / 5

కానీ ఇక నుంచి గ్యాస్ కనెక్షన్ కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. అడ్రస్ ప్రూఫ్ కూడా అక్కర్లేదు. కేవలం ఏదైనా గుర్తింపు ధృవీకరణ పత్రం చూపించి గ్యాస్ సిలిండర్ నిమిషాల్లోనే పొందవచ్చు. హెచ్‌పీ, భారత్ గ్యాస్, ఇండేన్ గ్యాస్ 5 కేజీ మినీ గ్యాస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ సిలిండర్లు తీసుకోవాలంటే సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి వెళ్లాలి. ఆధార్, పాన్ లాంటి ఏదైనా గుర్తింపు ధృవీకరణ పత్రం చూపించి సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తే సిలిండర్ అందిస్తారు.

2 / 5

ఇక భారత్ గ్?్యస్ సిలిండర్ కావాలంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800224344కు ఫోన్ చేసి కూడా 5 కేజీల సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2 గంటల్లోనే మీ ఇంటికి సిలిండర్ డెలివరీ చేస్తారు. ఇక ఇండేన్ గ్యాస్ సిలిండర్‌ను మీ సమీపంలోని కిరాణా దుకాణాలు లేదా రిటైల్ అవుట్‌లెట్లలో పొందవచ్చు. ఇక హెచ్‌పీ 5 కేజీల సిలిండర్‌ను పెట్రోల్ పంప్స్, రిటైల్ అవుట్‌లెట్లలో పొందవచ్చు. ఇక వాట్సప్, కంపెనీల పోర్టల్, వాట్సప్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్ విధానాల్లో రీఫిల్ కోసం బుక్ చేసుకోవచ్చు.

3 / 5

5 కేజీల సిలిండర్ కోసం సెక్యూరిటీ డిపాజిట్, సిలిండర్, రెగ్యూలేటర్‌తో కలిసి రూ.1300 నుంచి రూ.1500 వరకు ఖర్చు అవుతుంది. రూ.1100 నుంచి రూ.1200 వరకు సెక్యూరిటీ డిపాజిట్ ఉంటుంది. మీరు సిలిండర్ తిరిగి అందిస్తే సెక్యూరిటీ డిపాజిట్ వెనక్కి ఇచ్చేస్తారు. చాలాకాలం పాటు గ్యాస్ సిలిండర్ అవసరం లేదనుకుంటే సిలిండర్ సరెండర్ చేసి సెక్యూరిటీ డిపాజిట్ పొందవచ్చు. బ్యాచిలర్స్, వలస కార్మికులకు ఈ సిలిండర్ బాగా ఉపయోగపడుతుంది.

4 / 5

అద్దె ఇళ్లల్లో ఉండేవారు, విద్యార్థులు, ఒంటరి వ్యక్తులు, చిన్న కుటుంబాలవారికి 5 కేజీల సిలిండర్ ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కనెక్షన్ ప్రక్రియ కూడా చాలా సులభంగా ఉంటుంది. అడ్రస్ ప్రూఫ్ అవసరం ఉండదు. అంతకాకుండా అవసరం తీరిపోయాక సిలిండర్ వెనక్కి ఇచ్చేయ్యవచ్చు. దీంతో ఈసిలిండర్లకు మంచి డిమాండ్ ఉంది.

ఆధార్ వాడుతున్నవారికి సూపర్ న్యూస్ నేరుగా వెళ్లి సేవలు పొందవచ్చు నో వెయిటింగ్



ఆధార్ కార్డులో మార్పులు చేసుకోవాలా..? గంటల కొద్ది ఆధార్ సేవా కేంద్రాల్లో క్యూలైన్లలో వెయిట్ చేయాల్సిన పని లేదు. ముందుగానే ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకుని వెళితే ఎలాంటి టెన్షన్ ఉండదు. టోకెన్ క్యూలైన్లతో సంబంధం లేకుండా మీరు త్వరతగతిన సేవలు పొందవచ్చు.

ఆధార్ కార్డులో పేరు, మొబైల్ నెంబర్, అడ్రస్ లేదా ఇతర వివరాలు అప్డేట్ చేసుకోవాలా..? లేదా కొత్త ఆధార్ పొందాలనుకుంటున్నారా..? అయితే మీరు గంటలకొద్ది ఆధార్ సేవా కేంద్రాల్లో వెయిట్ చేయాల్సిన అవసరం లేదు. చాలామంది ఆధార్ సర్వీస్ కేంద్రాల్లో గంటల పాటు ఎదురుచూస్తూ ఉంటారు. జనం రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు తమ పని త్వరగా పూర్తి కాక చిరాకు పడుతూ ఉంటారు. ప్రజలకు ఈ ఇబ్బందులు తొలగించేందుకు యూఐడీఏఐ ఓ సదుపాయం కల్పిస్తోంది. అదే ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ బుకింగ్. ముందుగానే మీరు ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకుని, ఆ సమాయానికి ఆధార్ సేవా కేంద్రానికి వెళ్లి సేవలు పొందవచ్చు. ఎలా బుక్ చేసుకోవాలి..? ఏయే సేవలు పొందవచ్చు? అనే విషయాలు చూద్దాం.

ఆన్‌లైన్‌లో ముందుగానే అపాయింట్‌మెంట్

యూఐడీఏఐ ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ సేవలను ప్రవేశపెట్టింది. మీరు మీ సమీపంలోని ఆధార్ సేవా కేంద్రానికి వెళ్లాలనుకున్నప్పుడు యూఐడీఏఐ వెబ్ సైట్ లేదా ఆధార్ యాప్ ద్వారా ముందుగానే అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవచ్చు. మీరు ఏ సమయంలో సందర్శించాలనుకుంటున్నారో సమయం ఎంచుకోవాలి. ఆ సమయానికి నేరుగా ఆధార్ సెంటర్‌కు వెళ్లి సేవలు పొందవచ్చు. దీని వల్ల మీరు క్యూలైన్లో నిల్చోవాల్సిన పని ఉండదు. మీరు ఎంచుకున్న సమాయానికి వెళ్లి సేవలు పొందవచ్చు. ఇందుకోసం మీరు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన పని లేదు. యూఐడీఏఐ వెబ్‌సైట్లోకి వెళ్లి ఉచితంగా అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవచ్చు. ఇందుకోసం మీ ఆధార్‌తో మీ మొబైల్ నెంబర్ లింక్ అయి ఉండాల్సిన అవసరం లేదు. అయితే ఒక వ్యక్తి నెలకు రెండు అపాయింట్‌మెంట్లు మాత్రమే బుక్ చేసుకోవడానికి వీలు ఉంటుంది. మీ కుటుంబసభ్యుల కోసం కూడా మీరు అపాయింట్‌మెంట్ బుక్ చేయవచ్చు.

ఆధార్ సేవా కేంద్రాల టైమింగ్స్

ప్రతీ పట్టణం, నగరాల్లో ఆధార్ సేవా కేంద్రాలను యూఐడీఏఐ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓపెన్ చేసి ఉంటాయి. వారంలో ఏడు రోజుల పాటు ఇవి అందుబాటులో ఉంటాయి. నేరుగా వచ్చేవారికి ఒక టోకెన్ విధానం అందుబాటులో ఉండగా.. ఆన్‌లైన్లో అపాయింట్‌మెంట్లకు మరో టోకెన్ విధానం అమల్లో ఉంది. ప్రతీ కేంద్రంలో ఒక ఆపరేషన్స్ మేనేజర్, సెంటర్ మేనేజర్ ఉంటారు. ఈ కేంద్రాల్లో ఏసీ, త్రాగునీరు సౌకర్యంతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. కొత్తగా ఆధార్ తీసుకోవాలన్నా, ఆధార్

యూపీఐ వాడుతున్నారా..?త్వరలోనే పెద్ద మార్పు డబ్బులు పంపాలంటే ఇది తప్పనిసరిగా చేయాల్సిందే



యూపీఐ ఎక్కువగా వాడుతున్నారా.. అయితే త్వరలో ఒక పెద్ద మార్పు అమల్లోకి వచ్చే అవకాశముంది. టీ షాప్ దగ్గర చేసే చిన్న లావాదేవీలకు కూడా చాలామంది యూపీఐ ఉపయోగిస్తున్నారు. ఇక పెద్ద లావాదేవీలు సులువగా ఈ విధానం ద్వారా చేయవచ్చు. అయితే.. స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న ప్రతీఒక్కరూ ఏదోక యూపీఐ యాప్ వాడుతుంటారు. యూపీఐ లావాదేవీలు రోజురోజుకు రికార్డ్ సృష్టిస్తున్నాయి. ప్రతీరోజూ బిలియన్ల రూపాయల యూపీఐ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయి. దీంతో పాటు యూపీఐ ద్వారా జరిగే మోసాలు కూడా పెరిగిపోతున్నాయి. ఈ సైబర్ మోసాలను అరికట్టేందుకు ఆర్బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు బ్యాంకులు కొత్త ప్రతిపాదన చేశాయి. అనుమానాస్పద లేదా అధిక రిస్క్‌తో కూడుకున్న యూపీఐ లావాదేవీలు చేసేముందు పలు సేఫ్టీ ఫీచర్లను పాటించాలని బ్యాంకులు సూచించాయి. ఇలాంటి లావాదేవీలు చేసేముందు వినియోగదారులను అలర్ట్ చేసేలా కొత్త విధానాన్ని ప్రతిపాదించాయి. ఈ కొత్త విధానం ఏంటి..? ఎలా పనిచేస్తుంది? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

లావాదేవీ చేసేముందు అలర్ట్ మెస్సేజ్..

యూపీఐ ద్వారా జరిగే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్బీఐకు బ్యాంకుల కీలక ప్రతిపాదనలు చేశాయి. అనుమానాస్పద, హైరిస్క్ కలిగిన లావాదేవీలు చేసేముందు స్క్రీన్‌పై అవును లేదా కాదు అనే పాప్ అప్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని ఎన్‌పీసీఐ, ఆర్బీఐకు బ్యాంకులు సూచించాయి. అవునుపై ప్రెస్ చేస్తే లావాదేవీలు వెంటనే ప్రాసెస్ అవుతుంది. కాదు అని చెబితే ట్రాన్సాక్షన్ క్యాన్సిల్ అవుతుంది. ఈ రెండు ఆప్షన్లలో ఏది ఎంచుకోకపోతే గంటలోపు డబ్బులు బదిలీ అవుతాయి. చెల్లింపులు చేసేముందు ఒక అలర్ట్ మెస్సేజ్ తరహాలోనే ఇది ఉపయోగపడుతుంది. వినియోగదారులు మరోసారి కరెక్ట్ వ్యక్తికి పంపుతున్నాడా..లేదా అనేది తనిఖీ చేసుకునేందుకు సహాయపడుతుంది. తొందరపాటులో తప్పుడు వ్యక్తికి డబ్బులు పంపించడాన్ని ఇది కొంతమేర అడ్డుకట్ట వస్తుంది. ఈ విధానం తీసుకొచ్చేలా పలు బ్యాంకులు తమ పేమెంట్స్ యాప్స్‌లలో మార్పులను సూచిస్తున్నాయి. పర్సన్ టు పర్సన్ ట్రాన్సాక్షన్ జరిగేటప్పుడు డబ్బు రిసీవర్ ఖాతాలో జమ చేయడానికి ముందు యస్ లేదా నో అనే విధానంలో చెల్లింపుదారుడి ఆమోదం కోరతారు.

రూ.10 వేలకు మించి పంపాలంటే..

యూపీఐ ద్వారా రూ.10 వేలకు మించి పంపుతుంటే గంట వెయిటింగ్ పీరియడ్ వ్యవస్థను ఆర్బీఐ తీసుకురావాలని సూచిస్తోంది. ఈవిధానంలో మనం రూ.10 వేలకు మించి పంపాలంటే గంట తర్వాతనే రిసీవర్ ఖాతాలో పడతాయి. ఆ లోపు మీరు ట్రాన్సాక్షన్ క్యాన్సిల్ చేసుకోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా అనేక బ్యాంకులు యస్ లేదా నో అనే ఆప్షన్‌ను సూచిస్తున్నాయి. అయతే రూ.10 వేల పరిమితికి మించి చేసే లావాదేవీలకు "అవును-ఏమీ లేదు" అనే ప్రాంప్ట్‌ను చూపించమని బ్యాంకులు సూచించడం లేదు. తెల్లవారుజామున 2 గంటలకు చేసే లావాదేవీలు, వినియోగదారుడు ఇంతకు ముందు ఎన్నడూ లావాదేవీలు జరపని వారికి చేసే చెల్లింపులు, లేదా కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతాలకు (తరచుగా మనీ మ్యూల్స్ ఉపయోగించేవి) చేసే చెల్లింపులు వంటి అసాధారణ ప్రవర్తనను ప్రదర్శించే చెల్లింపులకు మాత్రమే ఈ ప్రాంప్ట్ కనిపించాలని కోరుతున్నాయి.

వంగానా? బుచ్చినా?.. స్టార్ హీరో ప్లాన్ ఎలా ఉంటుందో..



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసితో ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు బిజీగా ఉన్న విషయం తెలిసిందే. పాన్ వరల్డ్ రేంజ్ లో రూపొందుతున్న ఆ ఫారెస్ట్ అడ్వెంచర్ డ్రామా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. షూటింగ్ శరవేగంగా సాగుతుండటంతో.. ఆ సినిమా తర్వాత మహేష్ బాబు ఎవరితో సినిమా చేయబోతున్నారన్న చర్చ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ చేసే ప్రాజెక్టుపై నేచురల్ గానే ఆసక్తి నెలకొంది. వరల్డ్ వైడ్ గా మంచి గుర్తింపు తీసుకురానున్న వారణాసి తర్వాత ఆయన ఎలాంటి కథను ఎంచుకుంటారు? ఏ దర్శకుడికి ఛాన్స్ ఇస్తారు? అన్నది అభిమానుల్లోనూ చర్చకు దారితీస్తోంది. కొద్ది రోజులుగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో మహేష్ బాబు సినిమా ఉండొచ్చనే వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే మహేష్ కోసం సందీప్ పవర్ ఫుల్ కథ సిద్ధం చేశారని, డెవిల్ అనే వర్కింగ్ టైటిల్ తో ఆ ప్రాజెక్ట్ ముందుకు వెళ్లే అవకాశముందని ప్రచారం జరిగింది. మహేష్ కెరీర్ లో ఇప్పటివరకు చూడని మాస్, వైలెంట్, ఇంటెన్స్ షేడ్ లో ఆయన కనిపిస్తారని టాక్ నడిచింది. టాలీవుడ్ కు చెందిన ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఆ చిత్రాన్ని నిర్మించనుందన్న ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు మరో పేరు తెరపైకి వచ్చింది. అదే దర్శకుడు బుచ్చిబాబు సనా. ఉప్పెన, పెద్ది చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న బుచ్చిబాబు తన హ్యాట్రిక్ మూవీ ఎవరితో చేయబోతున్నారన్న ఆసక్తి నెలకొన్న వేళ.. మహేష్ బాబుతో ఆయన సినిమా చేయనున్నారనే ప్రచారం ఊపందుకుంది. తాజాగా పెద్ది ప్రమోషన్స్ లో ఆ విషయంపై స్పందించిన బుచ్చిబాబు.. మహేష్ బాబుతో సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. అయితే ఇంకా నిర్ణయం తీసుకోలేదని, క్లారిటీ రావడానికి టైమ్ పడుతుందని చెప్పారు. దీంతో ఆ కాంబినేషన్ పై వస్తున్న వార్తలకు మరింత బలం చేకూరింది. దీంతో ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికరమైన చర్చ మొదలైంది. రాజమౌళి సినిమా తర్వాత మహేష్.. సందీప్ వంగా లాంటి దర్శకుడితో వెళితే పాన్ ఇండియా స్థాయిలో మరో సంచలన ప్రాజెక్టు వస్తుందని కొందరు భావిస్తున్నారు. మరోవైపు బుచ్చిబాబు కూడా ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్ ను సరైన విధంగా మిక్స్ చేస్తూ విజయాలు అందుకుంటున్నారని, మహేష్ తో ఆయన కాంబినేషన్ కొత్త ఎక్సీరియన్స్ అందిస్తుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. అందుకే ప్రస్తుతం జరుగుతున్న ప్రచారాన్ని రూమర్లుగానే చూడాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా, బుచ్చిబాబు పేర్లు వినిపిస్తున్నప్పటికీ.. చివరి నిమిషంలో మహేష్ పూర్తిగా వేరే దర్శకుడితో సినిమా ప్రకటించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. గతంలో ఆయన ఇలాంటి సర్ప్రైజ్ నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఏదేమైనా వారణాసి తర్వాత మహేష్ వేయబోయే స్టెప్ ఆయన కెరీర్ లో మరో టర్నింగ్ పాయింట్ గా నిలవనుంది. మరి ఆయన గ్రీన్ సిగ్నల్ వంగాకా? బుచ్చిబాబుకా? లేక ఊహించని మరో దర్శకుడికా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.



సాయి పల్లవి సరికొత్త యాక్షన్ అవతారం!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న -ణ5- చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా ఎంపికైన సంగతి తెలిసిందే. దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో.. సహజసిద్ధమైన హావభావాలతో ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు సాయి పల్లవి. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ నటనకు ప్రాధాన్యత ఉన్న కథలను ఎంచుకుంటూ లేడీ పవర్ స్టార్ అనే ట్యాగ్ ను అనతి కాలంలోనే దక్కించుకున్నారు. అయితే ఇంతవరకూ సాయి పల్లవి టచ్ చేయని జోనర్ అంటూ ఒకటి ఉంది. ఇప్పటివరకూ ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించిన పల్లవి మాత్రం సరైన మాస్ రోల్ మాత్రం పోషించలేదు. ఈ నేపథ్యంలో తొలిసారి పక్కా మాస్ యాక్షన్ రోల్‌లో అలరించడానికి అమ్మడు రెడీ అవుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న -ణ5- చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో అమ్మడు పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తుండటం విశేషం. ఖాకీ దుస్తులు ధరించి చట్టాన్ని రక్షించే పటిష్టమైన పాత్రలో వెండితెరపై కనిపిం చంబోతుంది. ఇప్పటి వరకు సాఫ్ట్ రోల్స్ చేసిన సాయి పల్లవి నుండి ఇలాంటి ఒక రౌద్రరూపాన్ని ఎవరూ ఊహించలేదు. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ఇటీవల -అమరన్- చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి తెరకెక్కిస్తున్నారు. ఆయన సినిమాల్లో పాత్రల రూపకల్పన ఎంతో సహజంగా.. సమాంతరంగా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ క్రమంలోనే ణ5 చిత్రంలో సాయి పల్లవి పాత్రను సాధారణ హీరోయిన్‌గా కాకుండా.. కథను మలుపు తిప్పే బలమైన యాక్షన్ ఓరియెంటెడ్ క్యారెక్టర్‌గా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ పోలీస్ పాత్రకు న్యాయం చేయడం కోసం సాయి పల్లవి ఎక్కడా తగ్గడం లేదు. ఇందులో ఉండే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్- ఫైట్ సీన్స్ కోసం ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్ .. ఫిజికల్ ట్రైనింగ్ కూడా ప్రారంభించింది. నృత్యంలో సాయిపల్లవికున్న ఫ్లెక్సిబిలిటీ .. టైమింగ్ ఈ యాక్షన్ స్టంట్స్ చేయడంలో ఆమెకు ఎంతో ప్లస్ అవుతుందని చిత్ర బృందం భావిస్తోంది. డూప్స్ లేకుండా రియలిస్టిక్ యాక్షన్ సీన్స్ చేయడానికి పల్లవి మొగ్గు చూపుతుండటం విశేషం. ధనుష్- సాయి పల్లవి కాంబినేషన్‌కు సౌత్ సినీ ఇండస్ట్రీలో మంచి క్రేజ్ ఉంది. గతంలో ఇద్దరి కలయికలో రిలీజ్ అయిన -మారి 2- చిత్రంలోని రౌడీ బేబీ పాట సృష్టించిన రికార్డులు అన్నీ ఇన్నీ కావు. ఆ సినిమాలో ఇద్దరి మధ్య ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ, ఎనర్జీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్ రిపీట్ అవ్వడం..అదీ ఓ సీరియస్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో కావడం సినిమాపై అంచనాలను స్కై ని తీసుకెళ్తున్నాయి. ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా నటిగా తనను తాను నిరంతరం రీ-ఇన్వెంట్ చేసుకోవడానికి సాయి పల్లవి ప్రయత్నిస్తుంటుందని ఈ పాత్ర ఎంపిక మరోసారి నిరూపించింది. ఎమోషన్స్ మాత్రమే కాకుండా.. మాస్

రిటైర్ అయిపోదనుకుంటే షాక్ ఇచ్చిన నటి!

ప్రీతి ఝంగియాని పరిచయం అసవరం లేని పేరు. టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమలలో తనదైన ముద్ర వేసిన నటి. పవన్ కళ్యాణ్ సరసన -తమ్ముడు- వంటి బ్లాక్‌బస్టర్ చిత్రంలో నటించి అప్పట్లో ఓవెలుగు వెలిగింది. హిందీలో -మొహబ్బతేన్- చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఈ బ్యూటీ కొంతకాలంగా వెండితెరపై కనిపించకపోవడంతో నటనకు స్వస్తి పలికింది. విదేశాల్లో స్థిరపడిపోయిందనుకున్నారంతా. కానీ అమ్మడు అలాందిలేదంటూ నేను ఇంకా యాక్టివ్ గానే ఉన్నానంటూ షాక్ ఇచ్చింది. -నేను నటనను విడిచిపెట్టాననే వార్తల్లో ఎలాంటి నిజం లేదు. నటన నా ప్రాణం.. సినిమా కెరీర్‌ను ఎంతో ప్రేమిస్తాను- అని ప్రకటించింది. గత కొన్నేళ్లుగా వ్యక్తిగత జీవితంలో కొత్త బాధ్యతలు పెరగడం, పిల్లల ఎదుగుదలపై దృష్టి పెట్టడం వల్లే సినిమాల నుంచి కాస్త విరామం తీసుకోవాల్సి వచ్చిందని అంతే తప్ప పరిశ్రమను వదిలి వెళ్లాలనే ఆలోచన తనకు ఎప్పుడూ రాలేదని వెల్లడించింది. సినిమాలకు తాత్కాలికంగా దూరమైన ఈ సమయంలో ప్రీతి ఝంగియాని భర్త పర్విన్ దబాస్‌తో కలిసి వ్యాపార రంగంలో బిజీగా గడిపారు. ఇద్దరు సంయుక్తంగా ప్రో పంజా లీగ్ అనే ఆర్మ్ రెజ్లింగ్ క్రీడా లీగ్‌ను ప్రారంభించి దేశంలో దానికి మంచి ఆదరణ తెచ్చిపెట్టారు. ఒక పక్క లీగ్ వ్యవహారాలు చూసుకుంటూనే.. మరోపక్క ఇద్దరు కుమారుల బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించినట్లు తెలిపారు. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లు కావడంతో మళ్లీ నటన వైపు దృష్టి పెట్టడానికి సమయం దొరికిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో వచ్చిన ఓటిటి విప్లవం సినీ పరిశ్రమను పూర్తిగా మార్చేసిందన్నారు. ఇది నటీనటులకు అద్భుతమైన వరమని ప్రీతి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వయసుతో పని లేకుండా నటుల నైపుణ్యానికి తగ్గట్టుగా బలమైన పాత్రలు రూపుదిద్దుకుంటున్నాయని కొనియాడారు. కేవలం హీరోయిన్ పాత్రలే కాకుండా కథను మలుపు తిప్పే ఎలాంటి వైవిధ్యమైన క్యారెక్టర్లు వచ్చినా? చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని నటిగా తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకోవాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు హింట్ ఇచ్చారు. త్వరలోనే కొత్త సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటనలు వస్తాయని అభిమానులకు భరోసా ఇచ్చారు. ఎన్నేళ్లు గడిచినా ప్రేక్షకులు తనపై చూపిస్తున్న అదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా సౌత్ ప్రేక్షకులు తమ్ముడు సినిమాను ఇప్పటికీ గుర్తుపెట్టుకోవడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలిగిన నటీమణులు పెళ్లయి, పిల్లలు పుట్టిన తర్వాత పరిశ్రమకు పూర్తిగా దూరమై పోతారనే పాతకాలపు ఆలోచనా ధోరణిని ప్రీతి ఝంగియాని మాటలు బద్దలు కొడుతున్నాయి. నటనపై ఉన్న మక్కువతో ఇటు కుటుంబాన్ని అటు కెరీర్‌ను సమానంగా బ్యాలెన్స్ చేస్తూ మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడానికి సిద్ధమవుతున్న ఆమె నిర్ణయం తోటి నటీమణులకు స్ఫూర్తిదాయకం అని చెప్పొచ్చు.

సినిమాలే కాదు.. ఆస్తుల్లోనూ పాన్ ఇండియా ప్లాన్!

దీంతో అలీబాగ్‌లో ఇప్పటికే ఆస్తులు కలిగిన స్టార్‌ల జాబితాలో యష్ కూడా చేరిపోయారు.

ప్రముఖ సెలబ్రిటీలకు ఫేవరెట్ డెస్టినేషన్‌గా మారిన మహారాష్ట్రలోని అలీబాగ్ ఇప్పుడు మరో స్టార్ పేరును తన జాబితాలో చేర్చుకుంది. బాలీవుడ్ దిగ్గజాలు, క్రికెట్ ప్రముఖులు భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టిన ఈ కోస్టల్ హాట్‌స్పాట్‌లో తాజాగా కన్నడ రాకింగ్ స్టార్ యష్ కూడా అడుగుపెట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. తన భార్య రాధికా పండిట్‌తో కలిసి యష్ రూ.24 కోట్ల విలువైన ప్రీమియం బీచ్‌ఫ్రంట్ భూమిని కొనుగోలు చేసినట్లు రియల్ ఎస్టేట్ వర్గాలు వెల్లడించాయి. దీంతో అలీబాగ్‌లో ఇప్పటికే ఆస్తులు కలిగిన స్టార్‌ల జాబితాలో యష్ కూడా చేరిపోయారు. బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం, రాయగడ్ జిల్లా అలీబాగ్ తాలూకాలోని కమత్ గ్రామంలో ఉన్న రెండు ఆనుకుని ఉన్న వ్యవసాయ భూమి ముక్కలను యష్ దంపతులు కొనుగోలు చేశారు. సముద్రానికి ఆనుకుని ఉన్న ఈ ప్రాపర్టీ మొత్తం సుమారు 5,289 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. తూర్పు వైపు గ్రామీణ రహదారి, పడమర వైపు సముద్ర తీరాన్ని ఆనుకుని ఉండటంతో ఈ భూమికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా కిహీమ్ బీచ్‌కు సమీపంలో ఉండటం వల్ల ఈ ప్రాంతం గత కొన్నేళ్లుగా సెలబ్రిటీల పెట్టుబడులకు కేంద్రంగా మారింది. ఇప్పటికే బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్, స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె, క్రికెటర్ విరాట్ కోహ్లీ, బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ వంటి ప్రముఖులు ఈ ప్రాంతంలో విలాసవంతమైన ఆస్తులను కలిగి ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు అదే లిస్ట్ లో యష్ చేరడం ఆయన ఫైనాన్షియల్ ప్లానింగ్ పై కూడా ఆసక్తిని పెంచుతోంది. ఇక సినిమాల పరంగా చూస్తే యష్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నారు. ఒకవైపు భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న టాక్సిక: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ సినిమా, మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్న రామాయణ ప్రాజెక్ట్‌తో ఆయన బిజీగా ఉన్నారు. ఇలాంటి సమయంలో కోట్ల రూపాయల విలువైన కోస్టల్ ప్రాపర్టీలో పెట్టుబడి పెట్టడం ఆయన ఫ్యూచర్ ఫైనాన్షియల్ ప్లానింగ్ గా భావిస్తున్నారు. ముఖ్యంగా అలీబాగ్ గత కొన్నేళ్లుగా ముంబైకి సమీపంలో ఉన్న లగ్జరీ రియల్ ఎస్టేట్ హబ్‌గా వేగంగా ఎదుగుతోంది. సెలబ్రిటీలు, బిజినెస్ మ్యాన్స్, హై నెట్‌వర్త్ ఉన్న వ్యక్తులు ఈ ప్రాంతాన్ని సెకండ్ హోమ్ డెస్టినేషన్‌గా ఎంచుకుంటుండటంతో భూముల విలువలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యష్ చేసిన పెట్టుబడి కేవలం వ్యక్తిగత అవసరాల కోసమే కాకుండా ఫ్యూచర్ వాల్యూని దృష్టిలో పెట్టుకున్న స్ట్రాటజిక్ డెసిషన్‌గా కూడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమా రంగంలో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యష్ ఇప్పుడు రియల్ ఎస్టేట్ పెట్టుబడుల్లోనూ ప్రముఖ సెలబ్రిటీల సరసన నిలవడం విశేషంగా మారింది.



ఓటీటీని టార్గెట్ చేసిన చైతన్య.. దూత2 వెనుక అసలు స్ట్రాటజీ ఇదేనా?

అందులో భాగంగానే ఆయన సూపర్ హిట్ వెబ్ సిరీస్ దూతకు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న దూత2 ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.



అక్కినేని నాగ చైతన్య ప్రస్తుతం కెరీర్‌లో ఆసక్తికరమైన దశలో ఉన్నారు. ఒకవైపు భారీ స్థాయిలో తెరకెక్కుతున్న వృష కర్మ వంటి పాన్ ఇండియా ప్రాజెక్ట్‌తో థియేటర్లను టార్గెట్ చేస్తుండగా, మరోవైపు ఓటీటీ మార్కెట్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తోంది. అందులో భాగంగానే ఆయన సూపర్ హిట్ వెబ్ సిరీస్ దూతకు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న దూత2 ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. రీసెంట్ గానే ఈ సిరీస్ రెండో సీజన్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో పలు ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నటి భూమిక కీలక పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచుతోంది. గతంలో సవ్యసాచి సినిమాలో నాగ చైతన్యతో కలిసి నటించిన భూమిక, ఇప్పుడు మరోసారి ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని టాక్ వినిపిస్తోంది. దూత తొలి సీజన్ ఓటీటీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రింట్ మీడియా నేపథ్యాన్ని హారర్ థ్రిల్లర్ అంశాలతో మేళవించి డైరెక్టర్ విక్రమ్ కె కుమార్ రూపొందించిన కథనం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ముఖ్యంగా ప్రతి ఎపిసోడ్‌లో ఉత్కంఠను కొనసాగిస్తూ చివరి వరకు ఆసక్తిని నిలబెట్టిన విధానం ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు రెండో సీజన్‌లో మాత్రం పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి విక్రమ్ సిద్ధమవుతున్నారని సమాచారం. మొదటి సీజన్‌కు భిన్నమైన కథా ప్రపంచం, కొత్త మిస్టరీ ఎలిమెంట్స్, మరింత డార్క్ టోన్‌తో దూత2 రూపొందనున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మరోవైపు నాగ చైతన్య- విక్రమ్ కె కుమార్ కాంబినేషన్ కూడా ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణగా మారుతోంది. వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన థాంక్యూ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, దూత వెబ్ సిరీస్ మాత్రం ఈ ఇద్దరి కాంబోకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ముఖ్యంగా చైతన్యను కొత్త తరహా పాత్రలో చూపించిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు ఈ కాంబినేషన్ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. అంతేకాదు, దూత2 నాగ చైతన్యకు నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ప్రత్యేకమైన ప్రాజెక్ట్ కావడం విశేషం. తన కెరీర్‌లో తొలి నిర్మాణ ప్రయత్నాన్ని ఓ వెబ్ సిరీస్‌తో ప్రారంభించడం ద్వారా ఓటీటీ రంగంలో కూడా తన స్థాయిని మరింత బలోపేతం చేసుకోవాలని చైతన్య భావిస్తున్నట్లు తెలుస్తోంది. థియేటర్లలో వృష కర్మతో, ఓటీటీలో దూత2తో రెండు వేర్వేరు మార్కెట్లను టార్గెట్ చేస్తూ ఆయన ముందుకు సాగుతున్న తీరు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. సరైన కథలు, సరైన ప్లాట్‌ఫామ్‌ల ఎంపికతో నాగ చైతన్య తన కెరీర్‌ను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE kPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA- 500072.** Edtor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-221, ROAD NO.14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA- 500076. PRGI REGD NO.: TGTEL26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.comCorporate Office: HIG 79, VNR RESIDANCY, VENKATARAMANA COLONY, KUKATPALLY, HYDERABAD, 500085